నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
మంగళవారం | 13 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-హత్నూర

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన ఘటన హత్నూర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. హత్నూర మండల పరిధిలోని మధుర గ్రామానికి చెందిన తలారి సునీత ఇంటికి తాళం వేసి హాస్పిటల్ వెళ్లింది. అయితే ఆమె ఇంట్లోని సిలిండర్ ఒక్కసారిగా పేలి ఇల్లు దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పేయడానికి ప్రయత్నించినప్పటికీ.. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న బట్టలు, సామాగ్రి మరియు సుమారు లక్ష రూపాయల వరకు నగదు డబ్బులు పూర్తిగా కాలిపోయినట్టు బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని కన్నీరు మున్నీరైంది.

చదువుతోనే మహనీయుల కలలు సహకారం



నవతెలంగాణ-కంగ్టి

సమాజంలో ప్రతీ ఒక్కరు ఉన్నత చదువులు చదువుకుని.. అత్యున్నత స్థాయికి ఎదిగినప్పుడే అంబేద్కర్, పూలే లాంటి మహనీయుల కలలు సహకారం అవుతాయని కంగ్టి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రావణకుమార్ అన్నారు. కులవి వక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీయస్) 2024- నూతన సంవత్సర క్యాలెండరును సోమవారం సీఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో నేటికీ వివక్ష, అసమానతలు కొనసాగుత ఎన్నాయన్నారు. వాటి నిర్మూలన కోసం ఎందరో మహనీయులు కృషి చేశారన్నారు. వారి త్యాగాల ఫలితంతోనే నేడు సమాజంలో కొన్ని మార్పులు జరిగాయన్నారు. అంబేద్కర్, పూలే మహనీయుల బాటలో యువకులు నడవాలన్నారు. మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తా అంటరాని తనం, వివక్షకు వ్యతిరేకంగా కేవీపీయస్ పోరాడటాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కేవీపీయస్ మండలాధ్యక్షులు రాహుల్, ఎస్ఎఫ్ఐ జిల్లాఉపా ధ్యక్షులు కిందిదొడ్డి సతీష్, మండలాధ్యక్షులు పవన్, కేవీపీఎస్ నాయకులు దావీద్, బాబు, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో ఫిబ్రవరి 28 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీ డియట్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయా లని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మంది రంలో ఇంటర్ పరీక్షలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 28 నుండి మార్చి, 16 వరకు జరుగు ఇంటర్మీడియట్ పరీక్షలకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సంబంధిత అధికారులు సమ న్వయంతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇంట ర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9:00 గంటల నుం డి మ. 12:00 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 36,153 మంది హాజరు కానున్నారని,అందులో ప్రథమ సంవత్సరం పరీక్ష లకు 17,665 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం పరీక్ష లకు 18,488 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలి పారు. ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లు 17 ఏర్పాటు చేస్తు న్నట్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్లు, నాలుగు సిట్టిం గ్ స్క్వాడ్ టీములను ఏర్పాటు చేయడం జరిగిందని తెలి పారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ శాఖ గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధి ంచాలని, పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రాల ఏరి యాలలో జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు సకా లంలో పరీక్షలకు హాజరయ్యేలా పరీక్ష సమయానికి అను వుగా ఆర్టీసీ అధికా రులు బస్సులను నడపాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో ఒక ఏఎన్ ఎమ్‌ను కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్య అధికా రులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు.పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు తదితర మౌలిక వస తు లు ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద్ రామ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి మృతి పై సమగ్ర విచారణ జరపాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్, సంగారెడ్డి

సూర్యాపేట జిల్లాఇమామ్‌పేట సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దగ్గుపాటి వైష్ణవి మృతి అనుమానాస్పదంగా ఉన్నదని.. ఆమె మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యు లపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోటారి నర్సింలు, ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా గర్ల్స్ కన్వీనర్ వాణిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కేం ద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ ఖేడ్‌లో నర్సింలు, సంగారెడ్డిలో వాణి మాట్లాడుతూ.. కళా శాల ఫేర్వెల్ డేలో యాక్టివ్‌గా పాల్గొన్న వైష్ణవి అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో అకస్మాత్తుగా మృతి చెందడం అనుమానాలను కలిగిస్తున్నదన్నారు. వైష్ణవినీ ప్రభుత్వ జన రల్ ఆసుపత్రికి తీసుకువచ్చిన కళాశాల ప్రిన్సిపాల్, హాస్టల్ సిబ్బంది.. తల్లిదండ్రులకు కనీస సమాచార ఇవ్వకుండా అక్కడి నుంచి వెళ్లిపోవడం మరిన్ని అనుమానాలు రేకెత్తించే విధంగా ఉందన్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల సమస్యలు పట్టించుకోకుండా కళాశాల, హాస్టల్ సిబ్బంది విద్యార్థుల ఆత్మహత్యలకి కారకుల వుతున్నరన్నారు. వైష్ణవి మృ తిలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. మృతురాలి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రూ. 50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హాస్టల్లో జరు గుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు, సమస్యల పట్ల జిల్లా స్థాయిలో కలెక్టర్ చొరవ చేసుకుని వారికి కౌన్సిలింగ్ ఇవ్వాల న్నారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డిలోగర్ల్స్ కమిటీ సభ్యులు స్వప్న, ప్రీతి, వైష్ణవి, వందన తదితరులు ఉన్నారు.

వైష్ణవి మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని.. వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలని సమతా సైనిక్ దళ్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రాజ కుమార్ సంజీవులు వేరొక ప్రకటనలో డిమాండ్ చేశారు.

క్రీడా స్ఫూర్తిని నింపేందుకే క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-జహీరాబాద్

యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించినట్టు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ ఉజ్వల్ రెడ్డి అన్నారు. జహీరాబాద్‌లో గతనెల 26వ తేదీ నుంచి జరిగిన క్రికెట్ పోటీల్లో జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో వివిధ గ్రామ, మండల స్థాయిలో దాదాపుగా 150 టీంలకు పైగా పాల్గొన్నాయన్నారు. అదేవిధంగా బాగారెడ్డి స్టేడియం మైదానంలో వారం రోజుల పాటు డేఅండ్‌నైట్ మ్యాచులు కూడా కొనసాగాయన్నారు. డాక్టర్ ఉజ్వల్ రెడ్డి టెన్నిస్ బాల్ టోర్నమెంట్‌లో విన్నర్‌కు రూ.2,00,000 నగదు బహుమతి, రన్నర్‌కు రూ.1,00,000.. అదేవిధంగా మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌కు 11,000 ఇవ్వనున్నట్టు చెప్పారు. క్రికెట్ టోర్నీలో ఫైనల్‌లో రాయిపల్లి (డి), జహీరాబాద్ స్టార్ సీసీలు తలపడడం జరిగిందన్నారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాయిపల్లి(డి) 10 ఓవర్లలో 80 పరుగులు చేయగా.. జహీరాబాద్ స్టార్స్ 10 ఓవర్లో కేవలం 65 పరుగులే చేసింది. దాంతో 15 పరుగుల తేడాతో రాయిపల్లి డి విజయం సాధించింది. కాగా ఈ టోర్నీకి ముఖ్య అతిథులుగా డాక్టర్ ఉజ్వల్ రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, ఎంపీపీ గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెరకుపల్లి నారాయణ రెడ్డిలు హాజరై విన్నర్, రన్నర్‌లకు బహుమతులు అందజేశారు. అనంతరం ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ.. యువకుల్లో క్రీడా స్ఫూర్తి నింపేందుకే క్రికెట్ పోటీలను నిర్వహించినట్టు చెప్పారు. అదేవిధంగా గ్రామస్థాయి నుంచి క్రీడాకారులు బయటికి రావాలంటే గ్రామస్థాయిలో క్రీడల పట్ల యువతకు ఆసక్తి పెంచుకునేలా ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న 9 లారీలు, 3 హిటాచీలు సీజ్

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 హిటాచీలు, 9 లారీలను తహసీల్దార్ ఫర్హీన్ షేక్ సోమవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి రూలర్ ఎస్సై వినయ్ కుమార్, పోలీస్ సిబ్బందితోపాటు, ఆర్ఐ ప్రవీణ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సంతకాల సేకరణ



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె సమ్మెను జయప్రదం చేయాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ అడ్డాల దగ్గర సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం యాదగిరి మాట్లాడుతూ.. దేశంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న జరిగే భారత్ బంద్‌ని విజయవంతం చేయాలని ప్రజలకి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పెంటయ్య, మల్లేశం, ముత్యాలు, రాజు, సాయిలు, సంగమేశ్వర, రాజేశ్వర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి బీజేపీ పథకాల ప్రచారం



నవతెలంగాణ-జోగిపేట

బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు పల్లెకు పోదాం పదండి అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని డాకూర్ నాదలాపూర్ కొడకల్, ఇటిక్యాల, సంగుపేట, అల్మా యిపేట, చందంపేట గ్రామాలలో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరి ంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, జిల్లా నాయకులు శ్యామ గౌడ్, మహేందర్ పాల్గొన్నారు.

అవిశ్వాసాల జోరు



- సదాశివపేటలో నెగ్గిన అవిశ్వాసం
- సంగారెడ్డి, తూప్రాన్‌లో అవిశ్వాస తీర్మానాలు
- కలెక్టర్లకు చేరిన అవిశ్వాస పంచాయతీ
- ఇటీవల నర్సాపూర్, ఖేడ్‌లో పదవి దిగిన చైర్మన్లు
- బొల్లారం, ఇతర మున్సిపాలిటీల్లోనూ అవిశ్వాస రగడ
- మున్సిపల్ పీఠాలపై కాంగ్రెస్ పట్టు సాధించే ప్రయత్నం
- బీఆర్ఎస్‌లో గ్రూపుల లొల్లితో పదవి మార్పులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్స్, చైర్మన్లపై అవిశ్వాస పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే చాలా మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలు పెట్టారు. కొన్ని చోట్ల ఓటింగ్ కూడా జరగడంతో పాత చైర్మన్లు దిగిపోయి కొత్తవాళ్లు ఎన్నుకోబడ్డారు. తాజాగా సంగారెడ్డి, తూప్రాన్‌లో సోమవారం అవిశ్వాస తీర్మానాలిచ్చారు. ఇటీవలే సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. త్వరలోనే ఓటింగ్ ప్రక్రియ కూడా జరగనుంది. బొల్లారం చైర్‌పర్సన్‌పై కూడా అవిశ్వాసం పెట్టేందుకు గుసగుసలు మొదలయ్యాయి. బీఆర్ఎస్‌లో గ్రూపుల లొల్లి వల్ల ఒకే పార్టీకి చెందిన వాళ్లే అవిశ్వాసాలు పెడుతున్నారు. ఇదే అదునుగా మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పట్టు సాధించాలని చూస్తుంది.

మున్సిపల్ చైర్‌పర్సన్, చైర్మన్లపై అవిశ్వాసాల గొడవ ఎన్నికల ముందే మొదలైంది. అప్పట్లో ఎన్నికలు రావడం, నాలుగేళ్ల తర్వాతే అవిశ్వాసం పెట్టాలని గత ప్రభుత్వం చట్టం చేయడంతో అప్పట్లో అవిశ్వాసాల గొడవ సద్దుమణిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా చాలా చోట్ల అవిశ్వాసాల పరంపర కొనసాగుతునే ఉంది. బీఆర్ఎస్ ఓడిపోయినప్పటికీ గ్రూపుల లొల్లి వల్ల సంత పార్టీ వాళ్లే అవిశ్వాసాలు పెడుతున్నారు. మరో పక్క కాంగ్రెస్ వాళ్లు సైతం బీఆర్ఎస్‌లోని ఐనక్యతను సొమ్ము చేసుకుంటుంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఇదే ప్రక్రియ కొనసాగుతుంది. ఇటీవల మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు మున్సిపాల్టీల్లో అవిశ్వాసాల జోరు కనిపిస్తుంది. సిద్దిపేట జిల్లాలో 5, మెదక్ జిల్లాలో 4, సంగ్గారెడ్డి జిల్లాలో 8 మున్సిపాలిటీలున్నాయి. ప్రస్తుతం మెదక్, సంగారెడ్డి జిల్లాలో పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాసాల గొడవ నడుస్తోంది.

సంగారెడ్డి, తూప్రాన్‌లో అవిశ్వాసాలు..

సోమవారం సంగారెడ్డి, తూప్రాన్ రెండు మున్సిపాలిటీల్లోనూ అవిశ్వాస తీర్మానాలు పెట్టారు. సంగారెడ్డిలో చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిరవిని దించేందుకు బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ఇచ్చారు. నక్క మంజులత నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో మెజార్టీ కౌన్సిలర్లు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం ఇచ్చారు. సంతకాలు చేసిన అవిశ్వాస తీర్మానాన్ని బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో కలిసి అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఓటింగ్ ప్రక్రియ కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరారు. అదే విధంగా మెదక్ జిల్లాలోని తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ రవిందర్ గౌడ్‌పై వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో 11 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి కౌన్సిలర్లు చైర్మన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ఇచ్చి ఓటింగ్ నిర్వహించాలని కోరారు. నాలుగు రోజుల క్రితం సదాశివపేట మున్సిపాలిటీల్లోనూ కోటమ్మకు వ్యతిరేకంగా అవిశ్వాసం పెట్టారు. బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్‌ను గద్దె దించేందుకు ఆ పార్టీకి చెందిన వాళ్లే అవిశ్వాసం పెట్టారు. శివరాజ్‌పాటిల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు చెందిన మెజార్టీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో త్వరలోనే కొత్త చైర్‌పర్సన్‌ను ఎన్నుకోనున్నారు.

నారాయణఖేడ్, నర్సాపూర్‌లో దిగిపోయిన చైర్మన్లు

అసెంబ్లీ ఎన్నికల తర్వాత సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, మెదక్ జిల్లాలోని నర్సాపూర్ మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. నర్సాపూర్ మున్సిపాలిటీల్లో చైర్మన్‌గా మురళీదర్ యాదవ్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఆయన్ను పదవి నుంచి దించేందుకు బీఆర్ఎస్‌కు చెందిన మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారు. ఓటింగ్ నిర్వహించగా అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో మురళీదర్ యాదవ్ పదవిని కోల్పోయారు. దీంతో బీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తినే నూతన చైర్మన్‌గా ఎన్నుకున్నారు. నారాయణఖేడ్‌లో బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్‌ను దించేందుకు పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు కలిసి అవిశ్వాసం పెట్టారు. అధికారులు ఓటింగ్ నిర్వహించగా అవిశ్వాసం నెగ్గింది. ఆ తర్వాత మెజార్టీ కౌన్సిలర్లు కొత్త చైర్మ న్‌ను ఎన్నుకున్నారు. బీఆర్ఎస్‌కు బదులు కాంగ్రెస్‌కు చెం దిన వ్యక్తి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు.

బీఆర్ఎస్‌లో గ్రూపుల లొల్లి.. పట్టు సాధిస్తున్న కాంగ్రెస్

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల పదవుల విషయంలో బీఆర్ఎస్‌లో గ్రూపుల లొల్లి వీధికెక్కడంతో అవిశ్వాసాలు పెడుతున్నారు. అయితే పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించిన వాళ్లను దించి అదే పార్టీకి చెందిన వాళ్లను చైర్మన్లుగా ఎన్నుకుంటున్నారు. కొన్ని చోట్ల ఐక్యంగా లేకపోవడంతో బీఆర్ఎస్‌లోని గ్రూపు తగాదాల్ని కాంగ్రెస్ ఉపయోగించుకుంటుంది. మున్సిపాలిటీల్లో పట్టు సాధిస్తుంది. నర్సాపూర్‌లో బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లిన చైర్మన్‌ను దించి బీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తినే చైర్మన్‌ను చేసుకున్నారు. సదాశివపేటలోనూ బీఆర్ఎస్‌కు చెందిన చైర్ పర్సన్‌ను దించి అదే పార్టీకి చెందిన వ్యక్తిని చైర్‌పర్సన్ చేయాలని చూస్తున్నారు. సంగారెడ్డిలోనూ బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్ భర్త రవి పార్టీకి వ్యతిరేకంగా ఉంటున్నందున ఆయన సతీమణిని పదవి నుంచి దించి బీఆర్ఎస్‌కు చెందిన నక్క మంజులతను చైర్‌పర్సన్ చేయాలని బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. అయితే కొన్ని చోట్ల చేజార్చుకుంటున్న పరిస్థితి కూడా ఉంది. ఖేడ్‌లో బీఆర్ఎస్ నుంచి చైర్‌పర్సన్ పదవి కాంగ్రెస్‌కు పోయింది. తూప్రాన్‌లోనూ బీఆర్ఎస్ చైర్మన్‌ను దించి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కలిసి చైర్మన్ పదవి దక్కించుకో చూస్తుంది. అంటే ఇప్పటికే బీఆర్ఎస్ రెండు మున్సిపాల్టీలో చైర్మన్ పదవుల్ని చేజార్చుకుంది. బొల్లారం, జోగిపేట, మెద క్, రామాయంపేట, అమీన్‌పూర్ ఇతర మున్సిపాల్టీల్లోనూ అవిశ్వాసాలు పెట్టేందుకు లోలోపల సమీకరణలు జరుగుతున్నాయి.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- ప్రపంచమంతా ఇప్పుడు చిరుధాన్యాలు వాటి విలువలను గుర్తు చేస్తుంది
- డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణి రావు





నవతెలంగాణ-ఝరాసంగం

చిరుధాన్యాల పంటలే అందరికీ ఆరోగ్యదాయకమని.. వాటిని తినడం వల్ల ఎన్నో పోషకాలు అందుతాయని అందుకే డీడీఎస్ డైరెక్టర్ కీర్తిశేషులు సతీష్, డీడీఎస్ మహిళలు పాత పంటల జాతరను మొదలుపెట్టారని డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణిరావు అన్నారు. సోమవారం డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ(డీడీఎస్) 24వ పాత పంటల జాతర ముగింపు ఎడ్ల బండ్లు మచ్నూర్ గ్రామంలోనీ పచ్చ సాలే వరకు మహిళల కోలాటాలు ఆటపాటలతో చేరుకున్నాయి. పచ్చ సాలె ఆవరణలో ముగింపు జాతర సదస్సు ఘనంగా నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా కృష్ణ తేజ, తిమోతి డీడీఎం నాబార్డ్ సంగారెడ్డి, మెదక్, బిక్షపతి ఏడిఏ జహీరాబాద్, ప్రొఫెసర్ వినోద్ పావురాల యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఎస్ కిరణ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వికాస విశాఖపట్నం, జీవి రామాంజనేయులు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ డిడిఎస్ బోర్డు మెంబర్, అంజమ్మ ఎంపీపీ న్యాల్ కల్ మండలం, వేద కుమారి డీడీఎస్ బోర్డు మెంబర్ తదితరులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాల ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా నాబార్డ్ డీడీఎం మాట్లాడుతూ... చిరుధాన్యాలపై గ్రామాలలో అవగాహన పెంచాలన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేయడం వల్ల మంచి ఆరోగ్యం కలిగి ఉండగలుగుతున్నామన్నారు. వీటితో పర్యావరణం కూడా కలుషితం కాదన్నారు. ఈ చిరుధాన్యాలను 600 ఏండ్ల వరకు పాత పంటల జాతరను కొనసాగించాలని ఆశిస్తున్నామన్నారు. చిరుధాన్యాలు పండించిన వాటికి వ్యాల్యూ అడిషన్ చేసి మార్కెట్లో అమ్మగలిగే స్థాయికి మహిళలు ఎదగాలన్నారు. మెదక్ నాబార్డ్ డీడీఎం సి తిమోతి మాటాడుతూ.. చిరుధాన్యాలకు అయ్యే అయ్యే పంట పెట్టుబడి చాలా తక్కువ అని భవిష్యత్తులో ప్రతి కుటుంబానికి రెండు కేజీలు చిరుధాన్యాలు అందించే విధంగా డి డి ఎస్ మహిళలు ఎదగాలన్నారు. అందుకు నాబార్డ్ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. డాక్టర్ జీవి రామాంజనేయులు మాట్లాడుతూ.. చిరుధాన్యాలు పండించే విధానంలో ఆ విధానాలు మారకుండా రైతులు మారాలంటే అది సాధ్యం అయ్యే పని కాదని అందుకే తాము ఒక విధానపరమైన మార్పులు తీసుకురావాలని పనిచేస్తున్నామన్నారు. అందుకు అందరం సమిష్టిగా కలిస్తేనే ఆ పని సాఫల్యం అవుతుందని పేర్కొన్నారు. ఏడిఏ బిక్షపతి మాట్లాడుతూ.. జహీరాబాద్ అంటేనే చిరుధాన్యాలుగా పేరుగాంచిందని చిరుధాన్యాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పత్తి పంట తీసిన తర్వాత యాసంగిలో రెండవ పంటగా మొక్కజొన్నకు బదులుగా జొన్న, సజ్జ పంటలను కూడా రైతులు సాగు చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వం తరపున తమ వంతు సహకారం ఉంటుందన్నారు. జీవవైవిధ్య సంరక్షకులకు సన్మానాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వినోద్ పావురాల, జాతర కోఆర్డినేటర్ జనరల్ నరసమ్మ, జీవవైవిధ్య రైతులు నరసమ్మ, కందకం మొగులమ్మ, దండు స్వరూపమ్మ,డి డి ఎస్ మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.



నైపుణ్యాలను వెలికి తీయడానికే 'వైజ్ఞానిక ప్రదర్శన'

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందని బొల్లారం మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డిలు అన్నారు. బొల్లారంలోని వశిష్ట మోడల్ స్కూల్లో సోమవారం జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు వారి వారి వయసుల విద్యార్థులకు అనుగుణంగా నైపుణ్యాలను వెలికి తీయడానికి ఆచరణాత్మకంగా తెలియజే యడానికి ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోడానికి ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వశిష్ట మోడల్ స్కూల్ కరస్పాండెంట్ లోకనాథం, ప్రధానోపాధ్యాయురాలు ఎస్ హైమవతి, ఉపాధ్యాయ బృందం తోపాటు వాగ్దేవి హై స్కూల్ కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రాజోల గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో హద్నూర్ ఎస్సై రాము నాయుడు సిబ్బందితో కలిసి దాడి చేసి 9 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గరి నుంచి రూ. 41,050 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేకాట ఆడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని.. చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఐని కలిసిన బీఆర్ఎస్ మండల నాయకులు



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీఐ బాలస్వామిని బీఆర్ఎస్ మండల పార్టీ తరపున సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికా రు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ కిష్టయ్య, సొసైటీ చైర్మెన్ రత్నాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల అంజనేయులు, ఎంపీటీసీలు అల్లం లలిత, మాధవరెడ్డి, సత్య నారాయణ, రాములు, సంతోష్ కుమార్‌గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకే నిర్ణయం

- కార్యకర్తల రుణం తీర్చుకోలేనిది
- అందరి అభిప్రాయలతో భవిష్యత్తు కార్యాచరణ
- ఒకటిరెండు రోజుల్లో రాజకీయ నిర్ణయాన్ని ప్రకటిస్తా
- చిట్కుల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో నీలం మధు ముదిరాజ్



నవతెలంగాణ-పటాన్‌చెరు

తనను నమ్మి తన వెంట నడుస్తున్న కార్యకర్తల అభీష్టం మేరకే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుని నిర్ణయం తీసుకుంటానని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండలంలోని చిట్కుల్లో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో భవిష్యత్తులో వచ్చే రాజకీయ పరిణామాలు, నిర్ణయాలపై కార్యకర్తల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను నమ్మి నా వెంట నడిచిన కార్యకర్తల ఋణం తీర్చుకోలేనిదన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ఎన్నికల్లో తనకు మద్దతు నిలిచి తన వెంట నడిచిన కార్యకర్తల మేలు మరిచిపోలేనిదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ని అడ్డంకులు, అవాంతరాలు ఎదురైన ధైర్యంగా ఎదుర్కొని ప్రజల్లోకి వెళ్లి 50 వేలకు దగ్గరగా ఓట్లను సంపాదించి ప్రజల హృదయాలను గెలుచుకోవడం కార్యకర్తల ద్వారానే సాధ్యపడిందని తేల్చి చెప్పారు. మన కార్యకర్తల భవిష్యత్తు కోసం, మన ప్రజలందరి బాగు కోసం రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అందుకే తన ఊపిరి లాగా తనతో ఉంటున్న కార్యకర్తలందరి అభిప్రాయాల మేరకు నిర్ణయం తీసుకుంటానన్నారు. మీరు అందరూ దూరదృష్టితో ఆలోచించి, ప్రజలకు మరింత సేవ చేసి అండగా నిలబడేలా తమ కార్యాచరణ రూపొందించుకుందామని కోరారు. నా ప్రాణ సమానమైన మీ అందరి నిర్ణయమే నాకు శిరోధా ర్యమని, మీ సలహాలు, సూచనలకు అనుగుణంగా భవి ష్య త్తు కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడించారు. కార్యకర్తల అభి ప్రాయాల మేరకు ఒకటిరెండు రోజుల్లో భవిష్యత్తు రాజ కీయ నిర్ణయాన్ని వెల్లడిస్తానని ప్రకటించారు. అనంతరం సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ నీలం మధు ఏ నిర్ణయం తీసుకున్న స్వాగతిస్తామని తెలి పారు. ప్రజల అభీష్టానికి అనుగుణంగా మనల్ని నమ్మి తమ వెంట నడిచిన ప్రజలకు మంచి జరిగేలా నిర్ణయం తీసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎమ్ఆర్ యువసేన సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భూ తగాదాలతో వ్యక్తి దారుణ హత్య

పోలీసుల అదుపులో నిందితుడు



నవతెలంగాణ-జోగిపేట

భూతగాదాలతో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన అందోల్ మండలం అల్మాయిపేట గ్రామ శివారులో జరిగింది. జోగిపేట ఎస్సై అరుణ్ కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..

అల్మాయిపేట గ్రామానికి చెందిన ఇస్మాయిల్, ఖరీమ్‌లు అన్నదమ్ములు. ఖరీమ్ భార్య హయాబీ పేరిట అల్మాయిపేట శివారులో 1.30 ఎకరాల వ్యవసాయ పొలం ఉన్నది. అయితే ఈ భూమిలో తమకు వాటా ఉన్నదని, ఉమ్మడి కుటుంబానికి సంబంధించిన ఆస్తి అంటూ ఇస్మాయిల్ కొడుకు మునిరోద్దీన్(50), హయాబీ అల్లుడైన ఖమ్రోద్దీన్ అతని కొడుకు గఫర్‌ల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. గ్రామంలో నివాసం ఉంటున్న మునిరోద్దీన్, హైదరాబాద్‌లో స్థిరపడిన ఖమ్రోద్దీన్, అతని కొడుకు గఫర్‌లు అప్పడప్పుడు అల్మాయిపేట వద్దనున్న వ్యవసాయ భూమి వద్దకు వచ్చి సాగుచేయిస్తుండే వారు. భూ విషయంలో గతంలో పంచాయతీలు జరిగినా.. కొలిక్కి రాకపోవడంతో ఈనెల 11న పోలీస్ స్టేషన్‌ను సైతం ఆశ్రయించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వచ్చిన గఫర్ పొలం పనులను చేయిస్తుండగా.. అదే భూమి వద్దకు మునిరోద్దీన్ వెళ్లడంతో గొడవకు దారి తీసింది. ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. దీంతో మునిరోద్దీన్‌పైగఫర్ దాడి చేయడంతో కింద పడగా.. అతని ముఖంపై బండరాళ్లు వేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్ కుమార్, ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్‌లు సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని భార్య జమురున్నిషా ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకునిదర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్‌లు తెలిపారు. నిందితుడు గఫర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ భూములు ఆక్రమించిన క్వారీలు, క్రషర్‌లపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ భూములు చెరువులు, కుంటలను ఆక్రమించిన క్వారీ, క్రషర్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎర్దనూర్ గ్రామంలోని 231 సర్వే నంబర్‌లో క్రషర్స్ ఆక్రమించిన అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. అసైన్డ్ భూములను పేదల నుంచి లాక్కొని అక్రమంగా నడుస్తున్న క్వారీలు, క్రషర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ భూవ ఎలను తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంది మండలం ఎర్దనూరు గ్రామంలో లక్ష్మీ నరసింహ, ఇతర క్రషర్లు లోతైన క్వారీలు తవ్వి.. పైనుంచి వచ్చే వర్షపు నీరు కిందున్న చెరువులు, కుంటల్లోకి రాకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టమీది కుంట, కమ్మరోని కుంట, తమ్మల్దాని పడే కుంట, తూం కుంట చెరువుల్లోకి పై నుండి నీరు రాకుండా వందల మీటర్ల లోతు క్వారీల్లోనే నిల్వ ఉంటున్నదన్నారు. దాంతో వందలాది ఎకరాల భూములు సాగు చేయకుండా పడావుగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్రషర్ల బ్లాస్టింగ్ వలన అనేక మందికి ప్రమాదాలు జరిగాయన్నారు. అంతేకాకుండా బ్లాస్టింగ్ పొగ పంటలపై పడి రైతులు నష్టపోతున్నారన్నారు. ఇండ్ల పైన, ఇంట్లో ఆహార పదార్థాల పైన కూడా బ్లాస్టింగ్ పొగ పడుతుందన్నారు. దాంతో ప్రజలు ఆహారాన్ని కూడా తీసుకోలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. రాత్రిపూట క్రషర్ నుంచి అధిక లోడ్ ఉన్న వెహికల్స్ గ్రామం గుండా వెళ్లడంతో బూడిద గ్రామం చుట్టూ చేరు తుందన్నారు. ఈ క్రషర్ల వలన పొల్యూషన్ ఏర్పడే ప్రమాదం ఉందని పీసీబీ కూడా ఎంక్వయిరీకి వచ్చారని.. పూర్తి రిపో ర్టు పై అధికారులకు పంపించి పొల్యూషన్ కంట్రోల్ చేయా లన్నారు. ఈ క్రషర్ల బారి నుంచి గ్రామ ప్రజలను కాపాడాలని.. లేనియెడల గ్రామస్తులతో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నర్సిములు,యాదవ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్‌లో ఉన్న రాయసముద్రం చెరువులో పేరుకు పోయిన గుర్రపు డెక్కను సోమవారం తొలగించారు. గుర్రపు డెక్క పేరుకుపోవడంతో దోమల బెడద బాగా పెరుగుతున్నదన్న స్థానికుల వినతి జీహెచ్ఎంసి ఎంటమాలజీ సిబ్బందితో కలిసి కార్పొరేటర్ పుష్ప రాయసముద్రం చెరువు ప్రాంతాన్ని సందర్శించి అందులోని గుర్రపు డెక్కను తొలగింపజేశారు. అనంతరం ఓల్డ్ రామచంద్రాపురం మస్జీద్ ముందు ఉన్న బస్తీలో ఓపెన్ డ్రైన్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేసి శుభ్రం చేయించారు. కార్పొరేటర్‌గా మూడేండ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సంద ర్భంగా బస్తి వాసులు కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిరణ్ గౌడ్, చిగురు శ్రీను, రాములు యాదవ్, మణయ్య శోభా, మల్లికార్జున్, సీఎం మల్లేష్, ఉమారాణి, సుధాకర్, ఖాజా, మహేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్



కల్హేర్ మండలంలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు అబ్రహం కూతురు, మనూరు మండలంలోని సెల్గిరా గ్రామానికి చెందిన గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ ఫీల్డ్‌మ్యాన్ ప్రవీణ్ కుమార్ తమ్ముడి వివాహ వేడుక నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రూబీనా బేగం నజీబ్, గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ జీఎం.వెంగల్ రెడ్డి, ఏజీఎం ప్రభాకర్ రెడ్డి, ఆత్మ జిల్లా డైరెక్టర్ మారుతి, పట్టణ అధ్యక్షులు నగేష్, మనూరు మండల పార్టీ అధ్యక్షులు విట్టల్ రావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మసీద్,సర్పంచులు రాజు, నరసింహులు, గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నేషనల్ ఓపెన్ కరాటేలో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కంది

వైజాగ్‌లో జరిగిన నిజి షోటోకాన్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2024లో సంగారెడ్డి జిల్లాలోని ఆర్డినెన్సు ఫ్యాక్టరీ మెదక్ (ఓ డి ఎఫ్)లోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో మహిమ కటా బంగారు పతకం, కుమితే, శేశంకి కటా కాంస్యం సాధించారు. మరికొందరు విద్యార్థులు రజతం తదితర పతకాలు సాధించారు. మాస్టర్ పి. శ్రీనివాస్ హీరో సుమన్ చేతులమీదుగా కప్ అందించి అభినందించారు.

గొల్ల కుంటను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని కొడకంచి గ్రామ శివారులో గల గొల్ల కుంటకు సంబంధించి శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయంటూ నవతెలంగాణ దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తకు ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఇరిగేషన్ ఈఈ మధుసూదన్ రెడ్డి, డిఈ రామస్వామి, వర్క్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రెడ్డితో కూడిన బృందం గొల్ల కుంట శిఖంకు సంబంధించి 216 సర్వే నంబర్‌లో 5.32 ఎకరాల ఆయకట్టు ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. హద్దురాళ్ళు ఏర్పాటుచేసి కబ్జాకు గురైన ప్రాంతాన్ని గుర్తించి శిఖం భూముల పరిరక్షణకు తగిన చర్యలు ప్రారంభించారు. కాగాప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ రైతులకు, మత్స్యకారులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు అన్ని ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.

పుష్పాలంకరణ మహోత్సవానికి హాజరైన మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని కేబీఆర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చిన్నాల జనార్ధన్‌రావు, లక్ష్మి దంపతుల కుమార్తె హాసిని పుష్పాలంకరణ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ వేడుకలో మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, కొలను నరేంద్ర రెడ్డి, కౌన్సిలర్లు బాచుపల్లి జైపాల్ రెడ్డి, బీరప్ప యాదవ్, సతీష్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు విజయ్ రెడ్డి, శేషారెడ్డి, మాత్రాజులు హాజరై చిన్నారి హాసినిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు,కాలనీ వాసులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ ఎంపీడీవో బదిలీ

నవతెలంగాణ-న్యాల్‌కల్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీవోల బదిలీలు చేపట్టింది. ఈ క్రమంలో న్యాల్‌కల్ మండల ఎంపీడీవో వెంకటరెడ్డి నల్గొండకు బదిలీ అయ్యారు.

నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపిన విస్డం రైసింగ్ ఫౌండేషన్ సభ్యులు

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణ నూతన సీఐ బాలస్వామిని విస్డం రైసింగ్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్డం రైసింగ్ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్, ఎల్లేష్, నర్సింలు,సుభాష్, అరవింద్, అరుణ్ కుమార్, సాయికుమార్, విష్ణుకుమార్, దివాకర్, సందీప్ కుమార్, సురేందర్, కాంతారావు, రాజు, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు

బీజేపీ జిన్నారం మండలాధ్యక్షుడిగా జగన్

నవతెలంగాణ-జిన్నారం

బీజేపీ జిన్నారం మండలాధ్యక్షుడిగా సోలక్‌పల్లికి చెందిన కొత్త కాపు జగన్ రెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నాయకుల, కార్యకర్తలు సూచనలు, సలహాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడతానన్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, మండల శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

జోగిపేటలో మార్కండేయ జయంతి వేడుకలు

నవతెలంగాణ-జోగిపేట

శ్రీ మార్కండేయ జయంతి వేడుకలను సోమవారం జోగిపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని శివ స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జోగిపేట శ్రీ మార్కండేయ పద్మశాలి భక్తమండలి నాయకులు, మాజీ చేనేత చైర్మెన్ పడిగే సత్యం, కే.సత్యం, అనంత రాజ్, సుధీర్, లక్ష్మణ్, రాజశేఖర్, రాజేందర్, బాల్ రాజ్, శ్రీకాంత్, వెంకటేశం, వీరేశం, రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త సతీమణి అంత్యక్రియల్లో పార్టీ శ్రేణులు

నవతెలంగాణ-కంగ్టి

సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మురలే కిషన్ రావు భార్య సోమవారం ఆకస్మికంగా మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ ప్రధానకార్యదర్శి పట్లోల చంద్రశేఖర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నాగేష్ సెట్కార్‌లు ఆమె అంత్యక్రియలకు హాజరై.. వారి కుటుంభ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో తానాజీ పాటిల్, శివాజీపాటిల్, ప్రకాష్ పాటిల్, ఏశప్ప తదితరులు పాల్గొన్నారు

ఘనంగా మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు

నవతెలంగాణ-కల్హేర్

నిజాంపేట మండలంలోని రాంరెడ్డిపేట్ గ్రామంలో సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మార్కండేయ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పోలా రాములు అంబాదాస్, శ్రీశైలం, వెంకట్, వగ్గుసాయిలు, పండు, దిద్ది సాయిలు, పోలాసంగయ్య, వగ్గు జనార్దన్, గోపాల్, వగ్గు దుర్గ ప్రసాద్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లాలతో వృథాగా నీటికి పరిష్కారం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని వినాయకనగర్ కాలనీలో నీరు వృథాగా పోతుండడంతో.. కేజీఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి తన సొంత డబ్బుతో వృథాగా నీరు పోతున్న దగ్గర నల్లాలు ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా వినాయకనగర్ గల్లీలో ఎక్కడపడితే అక్కడ మురికినీటి కాలువలో చెత్త పేరుకుపోయి ఉండడంతో.. మున్సిపల్ అధికారులను పిలిపించి దగ్గరుండి నీళ్ల పోయేటట్టు చేశారు.

మల్లన్నకు మధుసూదన్ రెడ్డి పూజలు

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం శివనగర్ గ్రామం మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలను పురస్కరించుకొని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, జీహెచ్ఎంసీ కార్పొరేటర్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్ బృందం సోమవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు ఘనంగా వారిని స్వాగతించి.. సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం ఎంపీ ఉపాధ్యక్షులు గంగు రమేష్, శివనగర్ సర్పంచ్ రేఖ కృష్ణ, ఎంపీటీసీలు బత్తుల సంతోష్ మహేష్, స్వాతి ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రాజేష్, ఆది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

దేశ వ్యాప్త సమ్మెపై పారిశ్రామిక వాడల్లో ప్రచారం

నవతెలంగాణ-జిన్నారం

ఈనెల 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను సందర్భంగా జిన్నారం మండల పరిధిలోని ఖాజిపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడల్లో సిఐటియు, టి ఐ డి సి కార్మిక శ్రేణులు వాల్ పోస్టర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేట్ శక్తులకు వెన్నుదన్నుగా నిలుస్తూ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఈ సందర్భంగా సీఐటీయూ శ్రేణులు ప్రచారాన్ని చేపట్టారు. ఖాజిపల్లి గడ్డపోతారం పారిశ్రామిక వాడలో సీఐటీయూ, టీఐడీసీ శ్రేణులు.. జై సీఐటీయూ, జై జై సీఐటీయూ అంటూ నినాదాలు చేశారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని అర్హులైన జిల్లా ప్రజలు వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారుల తో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం గురించి విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలనీ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ ఓ సరి కొత్త పథకమని దీని ప్రారంభించడంలో ముఖ్య ఉద్దేశం.. చేతి వృత్తుల వారందరికీ కళా నైపుణ్యం కాలానుగుణంగా వారి ఉత్పత్తులు వాటి ప్రత్యేకతలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంకు 18 రకాల చేతి వృత్తుల వారు అర్హులన్నారు. స్వయం ఉపాధిగా తమ తమ వృత్తిలో చేతి పనిముట్లు ఉపయోగిస్తూ జీవించే ఇనుప పని ముట్లను చేసే కమ్మరి, వడ్రంగి, కంసాలి, చర్మకార వృత్తిలోని మోచీలు, వీధుల్లో తిరుగుతూ తాళాలు ఇతర మరమ్మత్తులు చేసేవారు, బీట కమ్మరి, బంగారు ,వెండి తయారు చేసే అవసలివారు, కుండలు చేసే కుమ్మరి, బుట్టలు అల్లె మేదరి వారు, ఇంటి నిర్మాణ పనులలో ఉండే ఉప్పరి వారు, పొంకలు తట్టలు చేసే ఎరుకలి వారు, బొమ్మలు చేసేవారు, చాకలి, మంగలి, పూలల్లే వారు, దర్జీ ఇంకా చేపలు పట్టే బెస్తకుల వృత్తులలో 18 ఏళ్ళు పైన బడిన వారు దరఖాస్తూ చేసుకోవాలని సూచించారు. కామన్ సర్విస్ సెంటర్లలో తమ ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్, బ్యాంకు పాస్ పుస్తకం మరియు ఆధార్‌తో లింకు వున్న మొబైల్ ఫోను తీసుకుని వెళ్ళి తమ వివరములను నమోదు చేసుకోవాలన్నారు. సీఎస్‌సి వివరాల కోసం గ్రామ పంచాయతీ సెక్రెటరీ / ఎంపీ ఓ / ఎంపీడీవోలను సంప్రదించాలని సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో పరిశీలించిన పిదప అర్హులైన వారి జాబితాను జిల్లా కమిటీ స్క్రూటీని చేసి, రాష్ట్ర కమిటీకి పంపడం జరుగుతుందన్నారు. పిఎం విశ్వకర్మకు ఎంపిక అయిన వారికి టూల్‌కిట్ ప్రోత్సాహకం కింద రూ.15,000, పిఎం విశ్వకర్మ డిజిటల్ గుర్తింపు కార్డ్, ధృవీకరణ పత్రం, శిక్షణ కాలంలో రోజుకు రూ. 500 స్టైఫండ్, మార్కెటింగ్‌లో సహాయ పడటం, బ్యాంకు నుంచి మొదటి విడతలో పూచీ కత్తు లేని వ్యాపారభివృద్ధి రుణం ఒక లక్ష రూపాయల వరకు తీసుకుని 18 నెలలలో 5 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెండో విడతలో రుణం రూ.2 లక్షల వరకు తీసుకుని 30 నెలలలో చెల్లించాలని తెలిపారు. ప్రత్యేకాధికారులు, గ్రామ సెక్రేటరీలు పథకంపై విస్తృత ప్రచారం కల్పించి అర్హులైన వారందరూ దరఖాస్తూ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ పథకం కింద జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎస్సీ ఎస్టీ ,బీసీ సంక్షేమ శాఖలు, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మున్సిపాలిటీ, ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం, సంగారెడ్డిలో అవగాహణ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఔత్సాహిక అభ్యర్థులు సద్వి నియోగం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, బీసీ,ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, డీపీఓ, డీఆర్‌డిఓ, కార్మిక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-పటాన్‌చెరు



బైకు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండం లోని కౌలంపేట గ్రామానికి చెందిన మహమ్మద్ చాంద్ పాషా (46) మండలంలోని ఇస్నాపూర్ గ్రామంలో గల చికెన్ షాప్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 8 గంటల సమ యంలో ఎదురుగా ఉన్న పాన్ షాప్ దగ్గరికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. ఇస్నాపూర్ వైపు నుంచి పాశం మైలారం వైపు వెళ్తున్న బైకు వేగంగా అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టింది. దాంతో చాంద్ పాషా ఎడమ కనత, కుడి కన్ను కింద బలమైన గాయాలవడంతో.. పట్టణంలోని ధ్రువ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో అదేరోజు రాత్రి 10:30 గంటల సమయంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు మహమ్మద్ జమాల్ ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నాణ్యమైన మందులనే విక్రయించాలి

నవతెలంగాణ-జహీరాబాద్

ఫర్టిలైజర్ దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే విక్రయించాలనిఏడీఏ బిక్షపతి అన్నారు. జహీరాబాద్ మండలంలోని వై జంక్షన్‌లో గల అగ్రిమార్ట్ ఫర్టిలైజర్ షాపును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలనే అందించాలన్నారు. నూతనంగా విడుదలైన పురుగు మందులు, విత్తనాలను ప్రమోట్ చేయడానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా తప్పనిసరిగా వినియోగదారులకు బిల్లులు ఇవ్వాలని సూచించారు .ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు బిక్షపతి ప్రదీప్ కుమార్ మాజీ సర్పంచ్ రాజు, కిషన్ రైతులు ఓనర్ రెడ్డి, మోహన్ ,సంజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆవేశంలో నేరాలకు పాల్పడితే.. జీవితాంతం బాధపడాలి

- చెడువ్యసనాలకు యువత దూరంగా ఉండాలి
- సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహనా

సదస్సులో ఎస్పీ రూపేష్ కుమార్

నవతెలంగాణ-జహీరాబాద్



కొంతమంది తెలిసీతెలియక ఆవేశంతో నేరాలకు పాల్పడితే.. జీవితాంతం బాధపడతారని జిల్లా ఎస్పీ రూపేష్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో డిగ్రీ విద్యార్థులకు సైబర్ నేరాలపై సోమవారం జరిగిన అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రోజు రోజుకు సైబర్, డ్రగ్స్, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘన పెరిగిపోతు న్నదన్నారు. నేడు సైబర్ నేరాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని.. ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగా ఉండా లన్నారు. లక్కీ డ్రా, కరెంటు బిల్, ఏటీఎం కార్డు రెన్యువల్ అంటూ ఫోన్ చేసి ఓటీపీ లు చెప్పమంటే.. ఎవరు కూడా చెప్పొద్దన్నారు. అమ్మాయిలను ఎవరైనా వేధిస్తే.. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా షీ టీంలను సంప్రదించా లన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు అలవాటు పడి విలు వైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని.. చెడు వ్యసనా లకు దూరంగా ఉండాలన్నారు. అలాగే లైసెన్స్‌లు పొందిన తర్వాతే వాహనాలు నడపాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, మత్తు పదార్థాల విక్రయాలు జరుపుతున్నారని తెలిసినా.. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని.. ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోపంగా ఉంచుతామన్నారు. నేరాలను అదుపు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నా మన్నారు. రోడ్డు నిబంధనలు పాటించకుండా వాహనాలను నడిపి ప్రమాదాలకు కారకులవుతున్న వారిలో 60 శాతం మంది యువతనే ఉంటున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా 60 శాతం మంది యువత రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పో వడంతో పాటు.. క్షతగాత్రులుగా మారుతున్నారన్నారు. సిగ్నల్స్ వద్ద వాహనాలను అదుపులో ఉండి నడపాలని విజ్ఞప్తి చేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడపడం చట్ట రీత్యా నేరమన్నారు. కాబట్టి యువత సన్మార్గంలో నడిచి.. ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించి మరెంతో మందికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అశోక్, డీఎస్పీ రఘు, సీఐలు రవి, వెంకటేశం, శివలింగం, ఎంవిఐ జయప్రకాష్‌రెడ్డి, ఎస్సై శ్రీకాంత్, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎసఐని సన్మానించిన ఎస్పీ..

జహీరాబాద్ పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళుతున్న సందర్భంగా ఆయన్ను జిల్లా ఎస్పీ రూపేష్ పూలమాల శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వారికి ఎక్కడైనా గుర్తి ంపు లబిస్తుందన్నారు. శ్రీకాంత్ జహీరాబాద్ పట్టణ ఎస్ఐగా సుదీర్ఘకాలంగా సేవలందించి ప్రజల మన్ననలు పొందారన్నారు.కార్యక్ర మంలో అడిషనల్ ఎస్పీ అశోక్,డీఎస్పీరఘు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-కల్హేర్

గ్రామాలభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి అన్నారు. గ్రామాల్లో మెరుగైన రహదారులు నిర్మించాలని నిధులు మంజూరు చేయించి శంకుస్థాపనలు చేస్తున్నామన్నారు. నిజాంపేట మండలంలోని రాంరెడ్డిపేట్ గ్రామంలో పంచాయతీ భవనం మరియు సీసీరోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ పాలన సక్రమంగా జరగడానికి గ్రామపంచాయతీ కార్యాలయం తప్పనిసరి అన్నారు. అందుకోసమే అన్ని గ్రామాల్లో పంచాయతీ భవనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాలలో మెరుగైన రహదారులు నిర్మించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తున్నదన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన ప్రతీ వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేసి తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలం నాయకులు ఎంపీటీసీ కృష్ణ సర్పంచ్ తనయుడు భూమేష్, రాధా కిషన్, మాజీ ఎంపీపీ మల్లేశం, ఎర్ర రవి, శ్రీకాంత్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి, ప్రవీణ్ గౌడ్, శ్రీను నాయక్, సుదర్శన్, బాబ్య నాయక్, వగ్గు సాయిలు, బలరాం, సుధాకర్, శివకుమార్ ఎన్ఎస్‌యుఐ నాయకులు బేతయ్య, జనార్దన్, సంగయ్య, ఎలయ్య తదితరులు పాల్గొన్నారు.

భవిష్య ఇంధనంగా హైడ్రోజన్

నవతెలంగాణ-పటాన్‌చెరు



కర్బన ఉద్గారాలు లేని ఇంధనంగా హైడ్రోజన్, ప్రత్యేకించి 'గోల్డ్ హైడ్రోజనను వినియోగించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని, పర్యావరణ పరిరక్షణలో ఇది కీలక భూమిక పోషించనుందని హ్యూస్టన్ (టెక్సాస్, అమెరికా) లోని గ్లోబల్ ఎర్త్ అబ్జర్వేషన్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ శర్మ ద్రోణంరాజు జోస్యం చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'భవిష్య ఇంధనంగా హైడ్రోజన్' అనే అంశంపై సోమవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు.ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ.. స్థిరమైన ఇంధన వనరుగా హైడ్రోజన్ గా వినియోగించవచ్చన్నారు. 2050కి ముందు హైడ్రోజన్ హైడ్రోకార్బన్లను 50 శాతం వరకు భర్తీచేయగల సామర్థ్యాన్ని ఇది కలిగి ఉందని. చెప్పారు. 'ఉపరితం హైడ్రోజన్ వ్యవస్థ యొక్క సంక్లిష్టతలను వివరిస్తూ, భూగర్భ హైడ్రోజన్ మూలాలు, ముంపు ముప్పులను పూర్తిగా అర్థం చేసుకోవడానికి మరింత పరిశోధన, పెట్టుబడి అవసరమని ఆయన నొక్కిచెప్పారు. ఖచ్చితమైన ఉద్గారాల నివారణ కోసం తగిన అన్వేషణ, నియంత్రణ, రవాణాలో సాంకేతికతల యొక్క వేగవంతమైన పరిణామాన్ని కూడా ఆయన విశదీకరించారు. అధ్యాపకులు, విద్యార్థులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు జవాబలిస్తూ, ఇంధనంగా హైడ్రోజన్ తో సంబంధం ఉన్న లక్షణాలు, సవాళ్లపై లోతైన అవగాహనను అందించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ సి.శ్రీనివాస్, ప్రొఫెసర్ సి. ఈశ్వర్, ప్రొఫెసర్ ఎస్. ఫణికుమార్ లతో కలిసి స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ వి.రాముశాస్త్రి అతిథిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మల్లేశం పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డి లోని సుందరయ్య భవన్‌లో సమ్మె, గ్రామీణ బంద్ కరపత్రం విడుదల చేశారు. అనంతరం మల్లేశం మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కోసం పనిచేస్తుంది తప్పా.. పేదల కోసం కాదన్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో కార్మికులకు, ప్రజలకు, రైతులకు చేసిందేమీ లేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, ధరల తగ్గింపు విదేశాల్లో దాచిపెట్టిన డబ్బును తెచ్చి పేద ప్రజల అకౌంట్లో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి.. కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేసిన మోడీకి గుణపాఠం చెప్పాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. పెట్రోల్, డీజిల్ నిత్యవసర సరుకుల ధరలు తగ్గించి మధ్యతరగతి ఉద్యోగులు, ప్రజల నడ్డి విరుస్తున్న మోడీకి గుణపాఠం చెప్పేందుకు 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌లో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు జయరాజ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, రైతుసంఘం అధ్యక్ష కార్యదర్శులు, యా దవరెడ్డి, రాజయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు, సీఐటీయూ నాయకులు యాదగిరి పాల్గొన్నారు.

నూతన ఎస్ఐకి సన్మానం

నవతెలంగాణ-గుమ్మడిదల



గుమ్మడిదల నూతన ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎం.నరేందర్ రెడ్డి, ఆకుల ఆంజనేయులు, రవీం దర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం సోమవారం మర్యాదపూ ర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. గుమ్మడిదల మండలం వ్యవసాయ ఆధారిత ప్రాంతంతో పాటు బొంతపల్లి, దోమడుగు, అన్నారం, మంబాపూర్, తదితర గ్రామాలు పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పారదర్శకంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

డాక్యుమెంట్ పోయినది

నేను అనగా మన్నె విఠల్ తండ్రి మన్నె మానయ్య గ్రా: పులికల్ నివాసిని అయిన నేను తేది 05/12/2015 న శ్రీమతి నర్సమ్మ భర్త మనయ్య గ్రా: పులికల్ వారి వద్ద నుండి 2.24 ఎకరముల భూమి సం నం :- 56 ఈ1, 56/1/1, 144 ఉ1, 532 అ 5/1,183 ఇ1 దానపత్రము చేసుకుని యున్నాను అట్టి దానపత్రము నెం: 4975/2015 కలది వర్జినల్ డాక్యుమెంట్ నా వద్ద నుండి మిస్ అయినది కావున అట్టి డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో నాకు తెచ్చి ఇవ్వగలరని మనవి చేయు చున్నాను.

ఇట్లు

మన్నె విఠల్

తండ్రి: మన్నె మానయ్య, సెల్: 9492306940

అధ్యయనం జ్ఞానాన్ని పెంపొందిస్తుంది

పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచుకోవాలి

నవతెలంగాణ పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన ఎఎస్పీ అశోక్

స్టాల్స్‌ను సందర్శించిన పలువురు సాహితీ వేత్తలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి





అధ్యయనం ద్వారా జ్ఞానం పెంపొందుతుందని, పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎఎస్పీ పి.అశోక్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే కాంప్ ఆఫీస్ పక్కన నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ (బుక్ హౌస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన- అమ్మకాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత సంతరించుకున్న నేటి పరిస్థితుల్లో అధ్యయనం పట్ల ఆసక్తి తగ్గిందన్నారు. మేధోమథనం చేసి గొప్ప గొప్ప వ్యక్తులు రాసిన రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సాహిత్య, సైన్స్, చరిత్ర, నవలలు, కవితలకు సంబంధించిన పుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా సామాజిక దృక్పథం ఏర్పడుతుందన్నారు. పోటీ ప్రపంచాన్ని జయించాలన్నా అధ్యయనం కీకలమన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువకులు పుస్తకాలను చదవడం ద్వారా మరింత పరిపూర్ణమైన విజ్ఞానవంతులుగా తయారవుతారన్నారు. నవతెలంగాణ పుస్తక ప్రదర్శన ద్వారా అనేక రకాలైన పుస్తకాలను సంగారెడ్డి జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బీరయ్య యాదవ్, బీసీ, ఎస్సీ సంక్షేమం శాఖ అధికారులు సర్వేశ్వర్‌రెడ్డి, జగదీశ్ నవతెలంగాణ పుస్తక ప్రదర్శనను సందర్శించారు. పుస్తక ప్రదర్శన కార్యక్రమంలో నవతెలంగాణ జీఎం నరేందర్, మేనేజర్ రేవంత్‌కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేకల కృష్ణ, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి నాగభూషణం, బుక్‌హౌస్ ఇంచార్జి పురుషోత్తం సతీష్, ప్రవీణ్, మమత పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
మెదక్
మంగళవారం 13 ఫిబ్రవరి 2024 www.navatelangana.com

పట్టణంలో రూ. 3 లక్షల నగదు చోరీ



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

పెద్ద శంకరంపేట పట్టణంలో పాత గ్రామపంచాయతీ వీధిలో స్వర్ణకారుడు శ్రీనివాసచారి ఇంట్లో గుర్తు తెలియని దొంగలు రూ. 3 లక్షల నగదును దోచుకెళ్లారు. బాధితుడు అవుసుల శ్రీనివాస చారి తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాస చారి ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో ఆదివారం చుట్టాల వద్ద ఫంక్షన్‌కు వెళ్ళాడు. కాగా సోమవారం ఉదయం దాదాపు 11 గంటల సమయంలో ఇంటికి వచ్చి ముందు తాళం తీయగా లోపలి భాగం రూములో అలమర తాళం పగలగొట్టి అందులోంచి రూ. 3 లక్షల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఆయన వివరించారు. ముందు భాగంలో తాళం వేసినట్లుగానే ఉందని. వెనుక భాగం నుండి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలో చొరబడి రూ. 3 లక్షల నగదును దొంగలించినట్లు ఆయన వివరించారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. బాధితులు ఫిర్యాదు మేరకు అల్లాదుర్గం ఎస్సై ప్రవీణ్ రెడ్డి మెదక్ క్లూస్ టీం బృందం సభ్యులు పేట ఏఎస్ఐలు విట్టల్ సునీత పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రజావాణితో సమస్యల పరిష్కారం

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-మెదక్

ప్రజావాణి కార్యక్రమంతో ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కారం చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని నిర్వహించిన ప్రజావాణికి 69 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ.. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి అధికారులు పరిష్కరిస్తారనే నమ్మకంతో ప్రజలు తమ అర్జీలను ప్రజావాణిలో సమర్పించేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు, పింఛన్, ఉపాధి వంటి సమస్యల పై ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రమేష్, డిఆర్ఓ పద్మశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంజనీర్ కానీ ఇంజనీర్ అయ్యప్పగారి శ్రీనివాస్

- కళానిలయం ఇంటర్నేషనల్ సంఘ సేవ సంస్థ అవార్డు గ్రహీత



నవతెలంగాణ-వెల్దుర్తి

ఇంజనీరింగ్ చదువులు చదవకున్నా స్వతహాగా ఇంజనీర్ పనులు చేస్తూ జిల్లా వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు గాంచిన ఘనత అయ్యప్ప గారి శ్రీనివాస్‌కే దక్కింది. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం చెందిన అయ్యప్పగారి శ్రీనివాస్ ఇంజనీర్ చదవకున్నా తనకున్న తెలివితేటలతో ఇంజనీర్ చేయలేని పనులను చేస్తూ, బోరు బావులను తవ్వడానికి సహజ సిద్ధంగా ఇంటి వద్దనే బోరు బండ్లను తయారు చేస్తూ గుర్తింపు పొందారు. స్వయంగా సీసీ కెమెరాలు, డ్రిల్ బిట్లను తయారు చేస్తూ ఎందరో మహానుభావుల మన్ననలను పొందిన ఘనత ఈయనకే దక్కింది. రాత్రనక పగలనకా పనిముట్లు తయారు చేస్తూ ఇంజనీర్లకి ఆదర్శప్రాయుడుగా నిలిచారు. రాష్ట్ర సరిహద్దుల వరకు వెళ్లి బోరు బావులు తవ్విన ఘనత ఈయనదే. అంతే కాకుండా సంఘ సేవలో కూడా కొనసాగుతున్నారు. ఈయన చేసిన సేవలకు 2023 సంవత్సరంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సేవా పురస్కార్ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డు కూడా అందుకున్నారు. కళానిలయం 25వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాదులోని కళానిలయం సాంస్కృతిక సంఘ సేవ సంస్థ ఈయన సేవలను గుర్తించి అవార్డును అందజేసింది. శ్రీ జంధ్యాల 73వ జయంతిని పురస్కరించుకొని ప్రముఖ హీరో శ్రీహరిష్ జంధ్యాల పురస్కారాన్ని జంధ్యాల పురస్కారం అయ్యప్పగారి శ్రీనివాస్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రముఖులు ఉన్నారు.

ఘనంగా మార్కండేయ స్వామి జయంతి



నవతెలంగాణ-కౌడిపల్లి

మండల కేంద్రమైన కౌడిపల్లి లో చేనేత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీమార్కండేయ స్వామి జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పిశ్కేనర్సింలు పద్మశాలి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిశ్కేనర్సింలు, డాక్టర్ పురుషోత్తం, రిటైర్డ్ ఎస్సై పిశ్కే శెట్టయ్య మాట్లాడుతూ పద్మశాలి ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పద్మ దుర్గయ్య, పోల జనార్ధన్, మాజీ వార్డ్ మెంబర్ సంబరపు తిరుమలేష్, భీమేష్, మంత్రి కృష్ణ, మంత్రి ఆంజనేయులు, అంకం అంజనేయులు, నరసింహులు, రవి, కృష్ణ, శ్రీనివాస్, ప్రభాకర్, నవీన్, పురుషోత్తం, సత్యనారాయణ, రంగేశ్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకున్ని పరామర్శించిన రాజకీయ నాయకులు



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కె వెంకటాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు దయాకర్ తండ్రి భిక్షపతి (83) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, మండల జడ్పీటిసి పంజా విజయ్ కుమార్ సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. జడ్పీటిసి శవయాత్రలో పాల్గొని పాడే మోశారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ కార్యక్రమంలో నార్లాపూర్ మాజీ సర్పంచ్ అమర సేనా రెడ్డి, రామాయంపేట పిఏసిఎస్ చైర్మన్ బాజే చంద్రం, గేరుగంటి నర్సింలు, కాసా రాజేశం, కైలాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఓపెన్ పరీక్ష ఫీజు పొడిగింపు



నవతెలంగాణ-పాపన్నపేట

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజును ఈనెల 21లోగా చెల్లించాలని పాపన్నపేట మండల కోఆర్డినేటర్ మహేశ్వర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ నరేందర్‌లు వెల్లడించారు. ఏప్రిల్, మే నెలలో నిర్వహించబోయే ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల కోసం ఫీజు గడువు ఈనెల 21 వరకు ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల కోసం ఒక్కొక్క సబ్జెక్టుకు వంద రూపాయల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. 25 రూపాయల ఫైన్‌తో ఈనెల 27 వరకు, 50 రూపాయల ఫైన్‌తో మార్చ్ 4వ తేదీ వరకు చెల్లించాలని వారు వివరించారు.

ఎరువుల దుకాణాలలో అధికారుల తనిఖీలు



నవతెలంగాణ-నార్సింగి

మెదక్ జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకురాలు విజయ నిర్మల మండల కేంద్రంలోని ఆగ్రిస్ రైతు సేవా కేంద్రం, రైతు ఉత్పత్తిదారుల సంఘంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా, ఎరువులను దుకాణాలలో ఉన్న స్టాక్‌తో ఈ పాస్ మెషీన్‌లో సరి చూసి పోల్చుకున్నారు. స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టికను పరిశీలించారు. ఎరువులు, యూరియా కొన్న రైతులకు ఇచ్చే బిల్లులను, పంపిణీదారుడి ద్వారా వచ్చిన ఎరువుల చలాన్లను పరీక్షించారు. అనంతరం స్టాక్ రిజిష్టర్లు, ధరల పట్టిక, బిల్లులు, చలాన్లు అన్ని కూడా ఆగ్రోస్, రైతు ఉత్పత్తి వారు సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. నార్సింగి మండల వ్యవసాయ అధికారి మెంగని యాదగిరి పాల్గొన్నారు.

అయోధ్యకు పేట వాసి సైకిల్ యాత్ర



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

పెద్ద శంకరంపేట పట్టణం నుంచి అయోధ్యకు పెద్ద శంకరం పేటకు చెందిన బలగం భానుచందర్ గౌడ్ సోమవారం ఉదయం పేట రామాలయం నుంచి సైకిల్ యాత్రగా తరలి వెళ్లాడు. అయోధ్యలోని శ్రీరాముడికి అరకిలో వెండితో తయారుచేసిన ధనుస్సు (బాణం) సమర్పించడానికి వెళ్తున్నట్లు ఆయన వివరించారు. పేట రామాలయం వద్ద ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఆలుగుల సత్యనారాయణ, గ్రామ పెద్దలు గంగారెడ్డి వడిచర్ల మల్లేశం, కాజిపల్లి సంతోష్ కుమార్, దశరథ్, సెట్ నారాయణ, రవి, వీరప్ప, జైహింద్ రెడ్డి, సత్తయ్య సార్, హరికిషన్ తదితరులు భానుచందర్‌ను సన్మానించగా సైకిల్ యాత్రగా అయోధ్యకు తరలి వెళ్లాడు. గతంలో సైతం రామ జన్మభూమి ఉద్యమ సమయంలో అయోధ్యకు వెండి ఇటుకలు సైతం సైకిల్ యాత్రగా వెళ్లి భానుచందర్ గౌడ్ సమర్పించారు. ఇలాంటి భక్తి కార్యక్రమాలు చేపట్టడం పట్ల ఆయన్ని పలువురు అభినందించారు.

ఎంపీఓ వసూళ్ల దందా

- కార్యదర్శుల నుంచి వసూళ్ల ఝులుం
- అంతా ఫోన్‌పే లోనే ట్రాన్సాక్షన్
- లబోదిబోమంటున్న పంచాయతీ కార్యదర్శులు





నవతెలంగాణ-కౌడిపల్లి

గ్రామపంచాయతీ కార్యదర్శులు నెలకు రెండు నుంచి మూడు వేల రూపాయలు కౌడిపల్లి ఎంపీఓ కలిముల్లాకు ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రతి నెలకు ఒకసారి తనిఖీల పేరుతో ప్రతి గ్రామపంచాయతీకి వెళ్లి కార్యదర్శి నుంచి 2 నుంచి 3 వేలు వసూలు చేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. మండల వ్యాప్తంగా 29 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీ కార్యదర్శి నుంచి కనీసం 2 వేల నుంచి 3వేలు వసూలు చేస్తూ నెలకి 60 నుంచి 70 వేలు వసూలు చేస్తున్నాడు. ప్రతి కార్యదర్శికి ఫోన్ చేసి మీ పంచాయతీలో సక్రమంగా పనులు జరుగుతున్నాయా, రికార్డులు కరెక్ట్ చేస్తున్నారా, డిపిఓ, డిఎల్‌పిఓ తనిఖీలకు వస్తున్నారా అంటూ బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేంటి అని అడిగితే మీరు సక్రమంగా పనిచేస్తలేరు అంటూ జిల్లా ఆఫీస్‌కి ఫోన్ చేసి తాను ఎక్కడ ఉంటే అక్కడికి పిలిపించుకొని రోజంతా తిప్పించుకొని సాయంత్రం ఇంటికి పంపిస్తాడు. డబ్బులు ఇవ్వకుంటే జిల్లా ఆఫీసుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. తనిఖీల పేరుతో బ్లాక్ మెయిల్ చేస్తూ రోజూ ఎవరో ఒకరిని టార్గెట్ పెట్టుకొని డబ్బులు వసూలు చేయటమే పనిగా ఎంపీఓ పనిచేస్తున్నారు. నెలకి నాలుగు తనిఖీ చేయాల్సి ఉండగా ఇతను మాత్రం జిల్లాలో ఎక్కడ లేని విధంగా ఆరుసార్లు తనిఖీ పేరుతో డబ్బులు వసూలు చేస్తూ గ్రామపంచాయతీకి వస్తూ బ్లాక్ మెయిల్ చేస్తుంటాడు. ఏదైనా అనారోగ్యం బారిన పడినప్పుడు కార్యదర్శులు సెలవు అడిగితే ఇవ్వకుండా జాబ్‌కి రిజైన్ చేయ్ లేదంటే పని మానేయి కానీ సెలవు మాత్రం ఇవ్వనంటూ బెదిరిస్తాడు. ఎంపీఓ కలిముల్లా కౌడిపల్లిలో విధుల్లో చేరి ఆరు నెలలు అవుతున్నప్పటికీ 29 గ్రామ పంచాయతీల కార్యదర్శుల నుంచి రూ.4 లక్షల వరకు బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేశాడని బాధిత కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కార్యదర్శులను టార్గెట్ చేసి వారిని బ్లాక్ మెయిల్‌కి పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని నెల నెల డబ్బులు తీసుకుంటూ జిల్లా అధికారుల పేర్లు చెబుతున్నాడు. సెలవు అడిగితే ఎందుకు రావు కారణం చెప్పాలి, విధుల్లో లేట్ అయితే ఎందుకు లేట్ అయింది ఇంతసేపు ఎక్కడికి పోయావు అంటూ పనికిరాని ప్రశ్నలు వేస్తూ మనోవేదనకు గురి చేస్తున్నాడని మహిళా కార్యదర్శులు ఆవేదన చెందుతున్నారు. ఔట్ సోర్సింగ్ కార్యదర్శుల కు నరకయాతన చూపుతూ బ్లాక్ మెయిల్ పేరుతో వచ్చే జీతం డబ్బులు కూడా ఎంపీఓకే చెందుతున్నాయని, దీనికి తోడు తనిఖీ పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఇదే విషయమై ఎంపీఓ కరిముల్లాను వివరణ కోరగా తాను ఎవరి వద్ద డబ్బులు తీసుకోలేదు. పై అధికారులకు ఎప్పుడైనా అవసరం ఉంటుంది కాబట్టి అప్పుడప్పుడు తప్పదు, ఎవరి ఇబ్బందులు వారికి ఉంటాయి, ఇబ్బందులు వచ్చినప్పుడు పై అధికారులకు ఇచ్చుకోక తప్పదు కదా అని సమాధానం ఇచ్చారు.



అంగన్ వాడి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.బస్వరాజ్



నవతెలంగాణ-టేక్మాల్

అంగన్వాడి ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని అల్లాదుర్గం ప్రాజెక్టు కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడి ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి బి. బస్వరాజు మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడి ఉద్యోగులకు గత డిసెంబర్ జనవరి 2 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2023 డిసెంబర్ నెల వేతనాలు రాష్ట్రంలో ఉన్న ఇతర జిల్లాలలో చెల్లించినప్పటికీ మెదక్ జిల్లాలో రెండు నెలలు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వం చెల్లించలేదన్నారు. ఒకే పని చేస్తున్న ఉద్యోగులకు ఒకేసారి వేతనాలు చెల్లించాలన్నారు అలా కాకుండా సగం మందికి వేతనాలు ఆపడం వల్ల అంగన్వాడి ఉద్యోగులలో కొత్త సమస్యలు ప్రభుత్వం సృష్టించడం న్యాయం కాదన్నారు. 2024 జనవరి వేతనాలు కూడా ఇంకా ఎవరికి రాలేదన్నారు. వీటితో పాటు 24 రోజులపాటు సమ్మె కాలం వేతనాలు కూడా ఇప్పటివరకు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. అంగన్వాడి సెంటర్‌లను మినీ అంగన్ వాడి సెంటర్లుగా చేస్తూ మినీ అంగన్వాడీ టీచర్లు అందర్నీ మెయిన్ టీచర్లుగా అప్ గ్రేడ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డర్స్ ఇచ్చారన్నారు. మెదక్ జిల్లాలో మాత్రం టీచర్లను మెయిన్ టీచర్లుగా చేస్తున్నట్టు ఇంకా ఆర్డర్స్ ఇవ్వలేదన్నారు. ఎండాకాలంలో ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్వాడి కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. అంగన్వాడి హెల్పర్లకు పాత పద్ధతిలోనే ఎస్ఎస్సి ప్రకారం ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఐసిడిఎస్ ప్రీస్కూల్ నిర్వాహణకు నష్టం కలిగించే అభయహస్తం, డిఎల్ఓ, తదితర ప్రభుత్వం అంగన్వాడి ఉద్యోగులతో చేయించకూడదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడి ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి ఉద్యోగులకు అభయహస్తం, మహాలక్ష్మి తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నింటిని అమలు చేయాలన్నారు. సెంటర్ అద్దెలు అంగన్వాడి టీచర్స్ అకౌంట్స్ లోనే కొలతలతో సంబంధం లేకుండా మొత్తం వేయాలన్నారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రేమలత విజయ, కమల, శకుంతల,తదితరులు పాల్గొన్నారు.

పాలన పట్టని గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు

- పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా
- సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి బి బస్వరాజ్







నవతెలంగాణ-పెద్దశంకరంపేట

జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మెదక్ జిల్లా కార్యదర్శి బి బసవరాజు మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీలలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందన్నారు. ప్రత్యేక అధికారులు వచ్చినప్పటి నుంచి పంచాయతీ కార్మికులపై పని ఒత్తిడి పెరిగిందన్నారు. కార్మికులకు తినడానికి కూడా సమయం ఇవ్వడం లేదన్నారు. సబ్బులు నూనెలు కూడా ఇవ్వడం లేదన్నారు. గత మూడు నెలల నుంచి గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. నవంబర్, డిసెంబర్, జనవరి మూడు నెలల వేతనాలు ప్రభుత్వం కార్మికులకు చెల్లించకపోవడంతో గ్రామపంచాయతీ కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పారిశుధ్య పని మీదనే కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారికి వేరే ఆర్థిక అవకాశం లేదన్నారు. ప్రభుత్వ అధికారులకు మాత్రం ఒకటవ తేదీన వేతనాలు ప్రభుత్వం సక్రమంగా చెల్లిస్తుందన్నారు. గ్రామీణ స్థాయిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు మాత్రం ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. సకాలంలో ప్రతి నెల సిబ్బందికి వేతనాలు చెల్లించాలన్నారు. గ్రామాలలో పంచాయతీ కార్మికులపై ప్రత్యేక అధికారుల వేధింపులు ఆపాలన్నారు. కార్మికులకు మధ్యాహ్నం గంటసేపు భోజనానికి సమయం కేటాయించాలన్నారు. కార్మికులందరికీ సబ్బులు, నూనెలు, ప్రతినెల ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగమేశ్వర్, నాయకులు రాములు, దాసు, రాములు, సంగయ్య, చిక్కి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మెదక్

గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ అన్నారు. సోమవారం మెదక్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీరాములుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం గత 3 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. మూడు నెలల నుంచి వేతనాలను చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వ అధికారులకు ఒకటవ తేదీన జీతాలు చెల్లించడానికి బడ్జెట్ కేటాయిస్తున్న ప్రభుత్వం కార్మికులకు మాత్రం వేతనాలు ఇవ్వడానికి రావడం లేదని మండిపడ్డారు. కొన్ని గ్రామాలలో ప్రత్యేకాధికారులు కార్మికులపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపించారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మధ్యాహ్న భోజనానికి గంట సమయం కేటాయించాలని, ప్రతినెల సబ్బులు, నూనెలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యులు, పద్మారావు, ప్రవీణ్, రాములు, పోచయ్య లక్ష్మయ్య, రాములు, బిక్షపతి, నర్సింలు, గోపాల్ తదితరులున్నారు.

నవతెలంగాణ -పాపన్నపేట

గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎల్ అశోక్ సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం పాపన్నపేట ఇన్చార్జి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామాలలో ప్రత్యేక అధికారుల వేధింపులు ఆపాలని, మధ్యాహ్న భోజనానికి గంట సమయం కేటాయించాలలన్నారు. వీరి వెంట గ్రామ పంచాయతీ సంఘ సభ్యులు మాణిక్యం, పోచయ్య లక్ష్మయ్య గోపాల్ తదితరులున్నారు.

చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాణాన్ని కలెక్టర్‌కు అందజేసిన కౌన్సిలర్లు



నవతెలంగాణ-మనోహరాబాద్

తూప్రాన్ మున్సిపల్‌లో నెలకొన్న అవిశ్వాస ఉత్కంఠకు నేటితో తెరపడినట్లైంది. ఎట్టకేలకు మరో కౌన్సిలర్ పదిమంది కౌన్సిలర్‌లకు మద్దతుగా రావడంతో సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు పదకొండు మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాణాన్ని అందజేశారు. తూప్రాన్ మున్సిపల్‌లో గత ఇరవై రోజులుగా మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవెందర్‌పై అవిశ్వాస తీర్మాణం పెట్టడానికి 16 మంది కౌన్సిలర్‌లలో పది మంది ఒక్కటయ్యారు. అవిశ్వాస తీర్మాణం పెట్టడానికి పద కొండు మంది కౌన్సిలర్లు అవసరం ఉండడంతో పది మంది మాత్రమే ఉండడంతో అవిశ్వాస తీర్మాణం పెట్టడానికి వీలుకాక పోవడంతో గత ఇరవై రోజులుగా వేచిచూశారు. కాగా గత రెండు రోజుల క్రితం బీఆర్ఎస్‌కు చెందిన ఏడుగురు కౌన్సిలర్‌లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దాంతో మరో కౌన్సిలర్ కోసం వేచి చూస్తున్న పది మంది కౌన్సిలర్‌లకు మద్దతుగా చైర్మన్ వర్గంలో ఉన్న మామిడి వెంకటేష్ పదిమందితో కలిసి వచ్చారు. దాంతో అవిశ్వాస తీర్మాణం పెట్టడానికి ముందుకు వచ్చారు. కాగా సోమవారం పదకొండు మంది కౌన్సిలర్లు కలిసి మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు అవిశ్వాస తీర్మాణాన్ని అందజేశారు. త్వరలోనే తేదిని ప్రకటించనున్నట్టు కలెక్టర్ తెలిపినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కొడిప్యాక నారాయణగుప్త, ఆర్ శ్రీశైలంగౌడ్, చెలిమెల ప్రియాంక., పల్లెర్ల జ్యోతి రవిందర్‌గుప్త, మామిండ్ల జ్యోతి కృష్ణ, జమాల్‌పూర్ లక్ష్మిబాయి నర్సోజి, రాజు, జిన్న భగవాన్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, మామిడి వెంకటేష్‌లు ఉన్నారు.

జిఎంఆర్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు

- విద్యార్థులకు సడక్ సురక్ష జీవన్ రక్ష అవగాహన



నవతెలంగాణ-మనోహరాబాద్

విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు భద్రతపై తెలుసుకున్న విషయాలను తల్లిదండ్రులతో పాటు బంధుమిత్రులకు అవగాహన కల్పించాలని తూప్రాన్ ఎస్సై శివానందం విద్యార్థులకు సూచించారు. జాతీయ రహదారుల సంస్థ ఆదేశాల మేరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ పురపాలక పరిధిలో గీతారెడ్డి కాలనీ గల ఒలింపియ ఇంటర్నేషనల్ స్కూల్లో జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, జి.యం.ఆర్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వేస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 'సడక్ సురక్ష - జీవన్ రక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జి. యం. ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'సడక్ సురక్ష - జీవన్ రక్ష అనే అంశంపై వ్యాస రచన, ఉపన్యాసం, పెయింటింగ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూప్రాన్ ఎస్.ఐ శివానందం, జి.యం.ఆర్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వేస్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ ముఖ్య అతిధులుగా విచ్చేసి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తూప్రాన్ ఎస్.ఐ శివానందం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కలిగిఉండాలన్నారు. రోడ్డుభద్రత అవగాహన కార్యక్రమం ద్వారా నేర్చుకున్న విషయాలను తప్పక పాటిస్తూ, తల్లీతండ్రులకు, బంధుమిత్రులకు కూడా తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రమేష్ రావు మాట్లాడుతూ విద్యార్థులలో గల ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. రోడ్డు భద్రత పై అవగాహన కల్పించిన జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఎస్ఐ శివానందం, జి.యం.ఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, పాఠశాల ప్రిన్సిపల్ రమేష్ రావు, ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, ఒలింపియ ఇంటర్నేషనల్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలమడుగులో న్యాయ విజ్ఞాన సదస్సు



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ మండల పరిధిలోని ర్యాలమడుగు గ్రామంలో వాల్టా యాక్ట్, కంజుమర్ ఫోరం, సివిల్, క్రిమినల్, ల్యాండ్ సమస్యలకు సంబంధించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అడ్వకేట్స్ రవి కుమార్, శారద, సిద్దిరాములు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు వారికి సంబందించిన చట్టాలు, గృహహింస చట్టాలు, హక్కులు, బాధ్యతలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్సు, హెల్మెట్ తప్పనిసరి ఉపయోగించాలని వివరించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, మెదక్ ద్వారా ఉచిత న్యాయ సహాయం, సలహాలు అందించడం జరుగుతుందని వివరించారు. అందుకుగాను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, మెదక్ నందు న్యాయవాదిని, పారా లీగల్ వాలంటీర్ ను నియమించిందని వివరించారు. అనంతరం అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిద్ధగౌడ్ మాట్లాడుతూ ఇతరుల హక్కులకు భంగం కలిగించడం నేరమన్నారు. చిన్న చిన్న తగాదాలకు కోర్టుల చుట్టూ తిరగడం వలన సమయం వృధా అవుతుందన్నారు. పేదలు, మహిళలు, వృద్దులు, ఎస్సీ ఎస్టీ లు, వికలాంగులు, ఆర్థికంగా వెనకబడిన వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం మెంబర్ ప్రమీల మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే 100 కి, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098లకు, షీ టీం వాట్సాప్ నంబర్ 6303923823 కి ఫోన్ చేయాలన్నారు. ఈ సదస్సులో మన్సూర్, రూరల్ ఏఎస్ఐ శివకుమార్, ఎంపీపీ యమున, మెదక్ ఆర్ఐ లక్ష్మన్, డీలర్ బిక్షపతి, అంగన్వాడీ కార్యకర్తలు, షీ టీం మెంబర్స్ విజయ్, ప్రమీల, భరోసా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ముగిసిన బ్యాట్మెంటన్ పోటీలు



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో శివ సాయి దంత వైద్యశాల ఎస్ఎస్ స్పోర్ట్స్ గజ్వేల్ వారి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన నియోజకవర్గ బ్యాట్మెంటన్ పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలలో గజ్వేల్ నియోజకవర్గం నుండి ముప్పై జట్లు పాల్గొన్నాయి. ఆదివారం సెమీఫైనల్ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్ రసవత్తరంగా కొనసాగింది. ఇందులో విజేతగా మొదటి బహుమతి రాజు పాష, ద్వితీయ బహుమతి ఉప్పల శ్రీనివాస్ మహేష్ రెడ్డి కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏడిఎఫ్ఓ సురేష్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, సివిల్ ఇంజనీర్ రాజ గురుప్రసాద్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాలు మానసికంగా ఉల్లాసానిస్తాయన్నారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాట్మెంటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జయ ప్రకాష్, భగవంత్, స్వరాజ్, సంతోష్, శేషాచారి, రాజు, శ్రీను, సుశీల్, రాధాకృష్ణ, శివ పాల్గొన్నారు.

కరాటే టోర్నమెంట్‌లో సిద్దిపేట చిన్నారుల ప్రతిభ

నవ తెలంగాణ - సిద్దిపేట : ఆదివారం జరిగిన 9వ తెలంగాణ రాష్ట్ర స్థాయి షోటకన్ కరాటే టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ శ్రీధర్ సాగర్ ఆధ్వర్యంలో శివఆంజనేయ గార్డెన్ నల్గొండ లో జరగగా సిద్దిపేట చిన్నారులు ప్రతిభ చూపినట్లు జిల్లా జోనల్ చీఫ్ భాగ్యరాజ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాలలో జిల్లా తరపున మొత్తం 72 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ప్రధమ స్థానంలో గోల్డ్ మెడల్స్ 17 , ద్వితీయ స్థానంలో సిల్వర్ మెడల్స్ 15, తృతీయ స్థానంలో కాపర్ 40 మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ అందుకున్నట్లు తెలిపారు. విజయం సాధించిన కరాటే చిన్నారులను టోర్నమెంట్ జడ్జి రాపోల్ సుదర్శన్ అభినందీచారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్ల చీఫ్ రాచకొండ అంజనేయులు, టెక్నికల్ డైరెక్టర్ పవన్ కళ్యాణ్, కరాటే కోచస్ శ్రీధర్, ప్రవీణ్ లు పాల్గొన్నారు.



16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- కనీస వేతనం రూ.26 వేలివ్వాలి : :సంద బోయిన ఎల్లయ్య

నవతెలంగాణ- గజ్వేల్


పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేల రూపాయలు నిర్ణయించాలని, కనీస పెన్షన.రూ.పది వేలు ఇవ్వాలని ఈ నెల 16న జరుగు సమ్మెలో కార్మిక వర్గం పాల్గొనాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో ఎంపీడీవో, అంగన్వాడి ప్రాజెక్టు కార్యాలయంలలో సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ ,కార్మిక ,రైతాంగ వ్యవసాయ కూలీలకు వ్యతిరేకంగా చట్టాలు చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యోగులు, కార్మికులు , రైతాంగం, వ్యవసాయ కూలీలు ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే సమ్మె, గ్రామీణ బంద్ నిర్వహించన్నుట్లు తెలిపారు. వీటిల్లో ప్రజలందరూ మద్దతిచ్చి పాల్గొనాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను తొలగించి వేస్తుందని ఆయన చెప్పారు. 12 గంటలు పని చేయాలని, ఉద్యోగులు, కార్మికులు సమ్మె చేయకుండా చట్టాలు రూపొందించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకట చారి, స్వామి , మహాలక్ష్మి, నర్సింలు, యాదగిరి, రఘుపతి పాల్గొన్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-చేర్యాల

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న దేశ వ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని పౌర సరఫరాల సంస్థ వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను హమాలీ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు గడుస్తున్నా కార్మికులు, రైతులు, కూలీలు, ప్రజల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా చేసి కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ప్రజల మధ్య వైశ్యమ్యాలను రెచ్చగొట్టడానికి మతతత్వ ఎజెండాను అమలు చేస్తుందన్నారు. సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ చేర్యాల పట్టణ కన్వీనర్ రాళ్ల బండి భాస్కర్, హమాలి కార్మికులు కనకయ్య, చంద్రం, బాబు, రమేష్, అనిల్ కుమార్, పోచయ్య పాల్గొన్నారు..



దళిత బంధు లబ్ధిదారులకు న్యాయం చేయాలి

ప్రజా భవన్ వద్ద రెండో విడత దళిత బంధు లబ్ధిదారుల బైఠాయింపు
ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చిన లబ్ధిదారులు

నవతెలంగాణ-బెజ్జంకి



గత ప్రభుత్వం గుర్తించిన రెండో విడత దళిత బంధు లబ్ధిదారులకు త్వరితగతిన న్యాయం చేయాలని మండలంలోని అయా గ్రామాలకు చెందిన సుమారు వంద మంది లబ్ధిదారులు సోమవారం ప్రజా భవన్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలేవైనా దళితుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి దోహదపడాలని, రెండవ విడత దళిత బంధులో లబ్ధిదారులుగా గుర్తించిన వారికి న్యాయం చేసేలా ప్రభుత్వం నిధులు విడుదల చేసి గ్రౌండింగ్ చేపట్టాలని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు లబ్ధిదారులు వినతిపత్రమందజేసినట్టు అంబేడ్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు దీటీ బాలనర్స్ తెలిపారు. లబ్ధిదారుల వినతిపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్టు బాలనర్స్ తెలిపారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేష్, కనగండ్ల రాజేశం, బెజ్జంకి కిష్టయ్య, బిగుల్ల మోహన్, బామండ్ల లక్ష్మణ్, కనగండ్ల సురేశ్, బిగుల్ల సుధర్శన్, మాశం బాబు, జంగిటి శంకర్, మాంకాల స్వామి, పొత్తూరి అంజి, కనగండ్ల శ్రీనివాస్, లింగాల అర్జున్ పాల్గొన్నారు.

అంగడి కిష్టాపూర్‌ను సందర్శించిన అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్



నవతెలంగాణ-మర్కుక్


ఫిబ్రవరి 7 నుండి 14 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ మండల పరిధిలోని అంగడి కిష్టాపూర్ గ్రామాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పనులను, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల ప్రగతి, విద్యార్థుల ప్రతిభ గుర్తించి విద్యార్థులను సన్మానించారు. గ్రామంలో వాటర్ ట్యాంకు వద్ద ఓవర్ ఫ్లో అయి వాటర్ రోడ్ల పైకి పారకుండా కమ్యూనిటీ ఇంకుడు గుంతను నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నర్సరీ, డంప్ యాడ్‌ను పరిశీలించారు. గ్రామంలో ప్లాస్టిక్ వాడకం ప్లాస్టిక్ నియంత్రణ కోసం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ కౌసల్యాదేవి, గ్రామ ప్రత్యేక అధికారి డిప్యూటీ తహశీల్దారు భాగ్యరేఖ, డీఎల్పీవో వేదవతి, ఎంపీవో రాజలింగం, మిషన్ భగీరథ డీఈ గిరిధర్, డిప్యూటీ సుమలత, ఏఈలు తిర్మల్ రెడ్డి, శ్రీధర్, తాజా మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్,ఉపాది హామీ సీటీఏ యాదగిరి, ఈసీ రాజు,టీఏ స్వామి, పంచాయతీ కార్యదర్శి నీలిమా, ఉపాధ్యాయులు ఓంకార్ రాధకృష్ణ, రామకృష్ణరెడ్డి, హరీక పాల్గొన్నారు.

వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి

ప్రజావాణిలో వినతి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్


వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సోమవారం నంగునూరుకు చెందిన నాయకులు సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఆ భూమిలో పురాతన సమాధులు ఉన్నాయని ఇప్పటికే అనేక సార్లు ఫిర్యాదులు చేశామని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన అధికారులు తహసీల్దార్ చర్యలు తీసుకోవాల ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు గులాం దస్తగిరి, ఉపాధ్యక్షులు నహీమ్, మండల కో- ఆప్షన్ సభ్యులు రహీంపాషా, అబ్దుల్ జహీర్, ఇమ్రాన్, హమీద్, ముక్కరం, ఆరీఫ్, జాక్రియా పాల్గొన్నారు.



శివాజీ విగ్రహ పున ప్రతిష్ఠాపనను విజయవంతం చేయాలి

నవ తెలంగాణ - సిద్దిపేట


వెంకటేశ్వర దేవాలయం వద్ద ఈ నెల 19న హింధూ వాహినీ ఆధ్వర్యంలో జరిగే చత్రపతి శివాజీ విగ్రహ పున ప్రతిష్టపాన మహెూత్సవాన్ని విజయవంతం చేయాలని హిందూ వాహిని సంయోజక్ బసవరాజు సత్యం కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్ లో విగ్రహ ప్రతిష్ట వాల్ పోస్టర్‌ను హిందూ వాహిని రాష్ట్ర నాయకులు భూమి రెడ్డితో కలిసి కరపత్రిక, గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19న సాయంత్రం 4 గంటలకు రేణుకా మాత దేవాలయం నుండి వెంకటేశ్వర దేవాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీ అనంతరం సాయంత్రం 6 గంటలకు శ్రీశ్రీ సిద్దేశ్వరానందగిరి స్వామీజీచే శివాజీ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. తెలంగాణ ప్రాంత హిందూ వాహిని రాష్ట్ర సంపర్క సహసంయోజక్‌గా కస్తూరి భూమిరెడ్డిని, రాష్ట్ర సమాచార సేకరణ సహసంయోజక్‌గా నరహరి నూతనంగా సిద్దిపేట నుండి ఎన్నికయ్యారు. కస్తూరి బూంరెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, చినుముల నరహరి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా వారిని శాలువాతో హిందు వాహిని తరపున సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ సంయోజక్ బండి కిరణ్ కుమార్, జిల్లా నిధి పరశురాములు, కార్యాలయ ప్రముఖ శ్రీకాంత్, పట్టణ సంపర్క ప్రముఖ రాజు ఎలక్ట్రికల్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ ప్రశాంత్, సిద్దిపేట నగర సహ సంయోజక్ మ్యూజిక్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల అమల్లో కాంగ్రెస్ అగ్రస్థానం

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్



సంక్షేమ పథకాలు అమల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రస్థానంలో ఉంటుందని అందుకే ప్రజలు అధికారం ఇచ్చినట్లు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూము కుంట నర్సారెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీ గిరిపల్లి కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రవేశపెట్టిన పథకాలన్నీ ఒక్కొకటిగా అమలు అవుతున్నాయన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులైతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి వెళ్లిపోయిన కార్యకర్తలు నాయకులు తిరిగి పార్టీలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్లో చేరిన వారిలో పెద్ద బాలయ్య రాజు, ప్రజ్ఞాపూర్ నర్సింలు, వార్డు మెంబర్స్ మల్లేశ్వర్, స్వామి, శ్యామల భాస్కర్, లక్ష్మీ నరసయ్య, రమేష్, పాపయ్య, పుట్ట శివలింగం, పుట్ట కృష్ణ, పెద్దల నరసయ్య ఉన్నారు. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయిని యాదగిరి, వెంకట్ గౌడ్, శివారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు





నవతెలంగాణ-బెజ్జంకి

మండల పద్మశాలి సంఘం అధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం సభ్యులు భక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అభిషేకం చేశారు. మండలాధ్యక్షులు మచ్చ శేఖర్, పట్టణాధ్యక్షులు బూట్ల సూర్య ప్రకాశ్, మాజీ సర్పంచ్ ద్యావనపల్లి మంజుల దంపతులు, వడ్డేపల్లి మల్లేశం, కొండా మల్లేశం, బూట్ల శ్రీపతి పాల్గొన్నారు.

నవతెలంగాణ -దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 18వ వార్డులో మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పద్మశాలి సమాజం అధ్యక్షుడు గాజుల తిరుపతి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి దంపతులు మార్కండేయుడికి ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. మార్కండేయ సుప్రభాతం, రుద్రాభిషేకం, ధ్వజారోహణం, వీరాంజనేయ స్వామి పూజ, మండపారాధన, నవగ్రహ పూజ, యజ్ఞము, పూర్ణాహుతి వంటి విశేష వైదిక కార్యక్రమాలతో పాటుగా తీర్థప్రసాద వితరణ అనంతరం అన్న సంతర్పణ నిర్వహించినట్లు అధ్యక్షుడు తిరుపతి తెలిపారు.

నవతెలంగాణ-మర్కుక్

మార్కండేయ జయంతి ఉత్సవాలను మండల కేంద్రమైన మర్కుక్‌లో పద్మశాలి అధ్యక్షులు ఎర్రగుంట శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం మార్కండేయ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, తదితరులున్నారు.




ఈవీఎం మిషిన్లను భద్రపరిచే స్ట్రాంగ్ రూంల పరిశీలన

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

నవ తెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ప్రక్కన గల ఈవీఎం గోదాంలో జరుగుతున్న ఈవీఎం మీషన్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్ పనులను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముందుగా ఈవీఎం మీషన్లు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం స్ట్రాంగ్ రూంల బయట సీసీ కెమెరాల పనీ తీరు టీవీల్లో చూస్తూ పరిశీలన, ఎఫ్ఎల్‌సి హల్‌లో ప్రత్యేక గుర్తింపు కార్డు, పోన్ బయట డిపాజిట్, డోర్ ప్రెమ్ మేటల్ డిటెక్టర్, హండ్ ఎల్డ్ మెటల్ డిటెక్టర్ ద్వారా పూర్తిగా పరిశీలించాకే లోనికీ పంపాలని సూచించారు. గోదాం చుట్టు గట్టి బందోబస్తు ఏర్పాటు చెయ్యాలని పోలీస్ అధికారులకు తెలిపారు. ఈవీఎం మీషన్ చెకింగ్‌లను జాగ్రత్తగా అత్యంత పకడ్బందీగా జరపాలని 13 మంది టెక్నికల్ ఇంజనీర్ల బృందం ను ఆదేశించారు. ప్రతిది ఈసీఐ నిబంధనల ప్రకారమే జరపాలన్నారు. ఎఫ్ ఎల్ సి లాగ్ బుక్, స్ట్రాంగ్ రూం లాగ్ బూక్ , ఈవిఎం గోదాం విజిటర్ రిజిస్టర్‌లను పరిశీలించి సంతకం చేశారు.



పీఏసీఎస్‌ల్లో సీఎస్సీ కేంద్రాలను ప్రారంబించాలి

అసిస్టెంట్ రిజిస్ట్రార్ రఘోత్తమ్ రెడ్డి

నవతెలంగాణ- ములుగు



పీఏసీఎస్ కార్యాలయాల్లో సీఎస్సీ (కామన్ సర్వీస్ సెంటర్) కేంద్రలను ఏర్పాటు చేసి రైతులకు 'ఈ- గవర్నెన్స్' సేవలను అందించాలని సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రఘోత్తమ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం ములుగులోని పీఏసీఎస్ కార్యాలయ భవన మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు అతితక్కువ ధరలకే ఈ గవర్నెన్స్ సేవలను అందించే ప్రక్రియ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అందించాలన్నారు. మండలంలో ఎరువుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎరువులు, విత్తనాలను సరఫరా చేయాలని సూచించారు. ఆయన వెంట పీఏసీఎస్ కార్యదర్శులు జితేందర్రెడ్డి, రమేష్బాబు ఉన్నారు.


ఫోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు, రూ.1 లక్ష జరిమానా

నవతెలంగాణ-మెదక్



ఫోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రూ. 1,00,000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి పి. లక్ష్మీశరద తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ బి.బాలస్వామి పేర్కొన్నారు. సోమవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెదక్ పట్టణం పంచముఖి కాలనీకి చెందిన కర్ణకంటి గోపాల్ అనే నిందితుడిపై మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫాక్సో కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపరచగా పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి పి. లక్ష్మీశారద నిందితునికి కఠినమైన జీవిత ఖైదు, రూ.1,00,000 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కేసు విచారణ అధికారులుగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.కె ఫజల్ అహ్మద్, స్పెషల్ ట్రైల్ పోక్సో కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రాజ్‌కుమార్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా డీఎస్పి ఫణీందర్, కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ మల్లారెడ్డి, కోర్ట్ కానిస్టేబుల్స్ జి. రవీందర్ గౌడ్, హన్మంతు వ్యవహరించారు. కేసుకు సంబంధించి పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


ఆరు గ్యారంటీలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుంది



నవతెలంగాణ- గజ్వేల్

ఆరు గ్యారంటీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు మూడు అమలు చేసిందని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు శివారెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతోమాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రెండు నెలలకే ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గం పార్టీ పూర్వ వైభవం తీసుకొస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టే పనిలో ప్రతిపక్షాలు ఉన్నాయని ఆయన విమర్శించారు.

ఉదయ సాహితీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కాంతికృష్ణ



నవతెలంగాణ-చేర్యాల

ఉదయ సాహితి (సాహిత్య వికాస వేదిక) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు బాల సాహితీ వేత్త గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణను నియమించినట్లు ఉదయ సాహితి సంస్థ గౌరవాధ్యక్షులు దాస్యం సేనాధిపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు పుస్తకాలను ప్రచురించిన కాంతికృష్ణ కవిగా ఉపాధ్యాయుడిగా విమర్శకుడిగా బాలసాహితీ వేత్తగా రాష్ట్రవ్యాప్త గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంతికృష్ణ ఎంపిక పట్ల చేర్యాల రచయితల సంఘం హర్షం వ్యక్తం చేసింది.

దుబాయ్‌లో తెలుగోడి సాహసోపేత స్వాగతం


నవతెలంగాణ -నంగునూరు



యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అబుదాబి నగరంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా ముందస్తుగా తెలంగాణ యువకుడు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామానికి చెందిన నాగిళ్ల శ్రీకాంత్ మన దేశ త్రివర్ణ పతాకం చూపిస్తూ జై హింద్ నినాదాలతో దుబాయ్‌లో ఆదివారం స్కైడైవ్‌తో సాహసోపేతమైన స్వాగతం పలికారు. అబుదాబి నగరంలో బోచసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామి నారాయణన్ ఆలయం ప్రారంభానికి సిద్ధమైంది. నరేంద్ర మోధీ ఈనెల 14న దేవాలయ ప్రారంభోత్సవం చేయనున్నారు. ఆలయ ప్రారంభానికి ఒక రోజు ముందు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని భారతీయులను ఉద్దేశిస్తూ ఫిబ్రవరి 13న 'అహ్లాన్ మోడీ' సమావేశంలో ప్రసంగిస్తారు. అబుదాబిలోని జాయెద్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో ఈ భారీ సమావేశం జరగబోతోంది. ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొననున్న ప్రధానికి ముందస్తుగా స్వాగతం విన్యాసాలు చేశారు. అందులో నాగిళ్ల శ్రీకాంత్ పాల్గొనడం మిత్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ కు చెందిన ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న శ్రీకాంత్ హైదరాబాదులోని తన మిత్ర బృందం జే బీ రియల్ ఎస్టేట్ గ్రూప్ కంపెనీ తరపున అబుదాబికి వెళ్లారు. అక్కడ 13 వేల ఫీట్ల ఎత్తు నుంచి స్కై డైవ్ చేస్తూ భారత పతాకాన్ని చూపిస్తూ స్వాగతం పలికాడు.



సాగునీరు విడుదల చేయాలని వినతిపత్రం



నవతెలంగాణ -నంగునూరు : రంగనాయక సాగర్ రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన రైతులు సోమవారం నీటిపారుదల శాఖ కార్యాలయంలో డీఈ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాగులు, చెక్ డ్యాంలు, బావులు అడుగంటి పోవడంతో తమ పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. నీటిని విడుదల చేస్తే వాగులకు చెక్ డ్యాంలకు నీరు వచ్చి తమ పంట పొలాలు పారే అవకాశం ఉందన్నారు. రంగనాయక ద్వారా నీటిని విడుదల చేయాలని అధికారులను కోరినట్లు రైతు తెలిపారు. నీటి పారుదల శాఖ డిప్యూటీ ఈఈ చంద్రశేఖర్ నేడు సాయంత్రం లోపు నీటిని విడుదల చేస్తామని రైతులతో సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రైతులు సత్యనారాయణ రెడ్డి, రాజేశ్వర్, వెంకటరామిరెడ్డి, సుధాకర్, చంద్రమౌళి, యాదగిరి, సదానందం, గోపాల్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

నవ తెలంగాణ -గజ్వేల్ : గజ్వేల్ 10వ వార్డ్‌కు చెందిన జే కుమారి భాయ్ కూతురు వివాహానికి ఆర్థిక సహాయం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్ గుప్త ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ రహీమ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి అమ్మాయి వివాహానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించడం హర్షనీయ మన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులతో పాటు కౌన్సిలర్ రహీమ్ తన స్వంతంగా మరో రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్, లయన్ దొంతుల సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కేసీఆర్ కృషి

ఎఫ్డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

దేవాలయాల అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేసినట్లు ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో శివ మార్కెళ్ళ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని దేవాలయాలను అభివృద్ధి చేసిందన్నారు. యాదాద్రి, వేములవాడ, కొమురెల్లి మల్లన్న, కొండ పోచమ్మ దేవాలయాల అభివృద్ధికి కృషి చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ ఎన్సి రాజమౌళి, గజ్వేల్ పద్మశాలి సంఘం నాయకులు తలకొక్కుల దుర్గాప్రసాద్, గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే

మాజీ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్ ,రఘునందన్ రావు



నవతెలంగాణ- గజ్వేల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ను చూస్తే కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు అన్నదమ్ముల వలె కలిసిపోయినట్టు కనిపిస్తుందని మాజీ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు అన్నారు. సోమవారం గజ్వేల్‌లో నిర్వహించిన బీజేపీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు అదే పద్ధతిలో ముందుకు వెళ్తున్నారని వారు విమర్శించారు. గత ప్రభుత్వం పై దుమ్మెత్తి పోసిన పీసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్ రెడ్డి మాటలు చెప్పారు తప్ప ఇప్పుడు చేసింది ఏమీ లేదన్నారు. కేసీఆర్ బాటలోనే రేవంత్ నడుస్తున్నాడని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో చేసిన పాపాలకు జైలుకెళ్లడం తప్పదన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రైల్వే లైన్‌లతో పాటు ఇతర అభివృద్ధి పనులకు రూ.16 వేల కోట్ల రూపాయలు కేటాయించిన ఘనత నరేంద్ర మోడీకి ఉందన్నారు.

ఆవాలతో మార్కండేయ చిత్రం

నవతెలంగాణ -గజ్వేల్



మార్కండేయ జయంతిని పురస్కరించుకుని ఆవాలను ఉపయోగించి 3 రోజులు శ్రమించి ధ్యానం చేస్తున్న మార్కండేయుని భారీ ప్రతిరూపాన్ని అద్భుతంగా రూపొందించి సోమవారం రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డ్ గ్రహీత రామకోటి రామరాజు చేతుల మీదుగా చిత్రీకరించారు.

విద్యానికేతన్ హై స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్

నవ తెలంగాణ - సిద్దిపేట

పట్టణంలోని విద్యానికేతన్ హైస్కూల్లో జరిగిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని కౌన్సిలర్లు పూర్ణిమ- ఎల్లం యాదవ్, తస్లీమ్ బేగమ్ - అబ్దుల్ మొయిజ్ లు ప్రారంభించారు. విద్యార్థులు వివిధ రకాల ఆధునిక, సాంప్రదాయ వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకే ఇలాంటి కార్యక్రమాలు దోహద పడుతాయని చెప్పారు. జంక్ ఫుడ్‌తో పోశకాలున్న ఆహారాన్ని మర్చిపోతున్న ప్రస్తుత తరుణంలో సాంప్రదాయ వంటకాల ప్రాధాన్యతను తెలిపేందుకే ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగ పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్కూల్ కరెస్పాండెంట్ అయేషా, హెడ్మాస్టర్ గోపి, టీచర్స్, పేరెంట్స్ పాల్గొన్నారు.



ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

నవ తెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే పిర్యాదులకు అధిక ప్రాధాన్యత నిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్) గరిమా అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వలసలు

నవతెలంగాణ-ములుగు



పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్లో చేరుతున్నట్లు గుంటు బిక్షపతి తెలిపారు. మండల పరిధిలోని శ్రీరాంపూర్ గ్రామంలో గుంటి బిక్షపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లోకి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్లో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసబోయిన శ్రీనివాస్, గుంటి భానుచంధర్, ఉషం వెంకటేష్ కోపరేటివ్ డైరెక్టర్, లింగ శ్రీను, ఉషం కిష్టయ్య, గుంటి రమేష్, జాజుల మల్లయ్య పాల్గొన్నారు.

వెంకట్రావుపేట పాఠశాల విద్యార్థి కీర్తికి రాష్ట్ర స్థాయిలో 4వ స్థానం



నవతెలంగాణ-తొగుట: సూర్య నమస్కారాల పోటీలలో వెంకట్రావుపేట పాఠశాల విద్యార్థి బి. కీర్తి రాష్ట్ర స్థాయి పోటీలలో 4వ స్థానం సాధించడం హర్షణీయం అని ప్రధానోపాధ్యాయులు నయీమా కౌసర్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసో సియేషన్, సిద్దిపేట జిల్లా యోగాసన అసోసియే షన్, వ్యాస మహర్షి యోగ సొసైటీ అసోసియేషన్ ఫోరం నిర్వహించిన రాష్ట్రస్థాయి సూర్య నమస్కా రాల పోటీలు సిద్దిపేట బాలికల ఉన్నత పాఠశాల లో నిర్వహించారు. ఈ పోటీలకు తెలంగాణలోని 33 జిల్లాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడి యం, ప్రైవేట్ పాఠశాలలకు, అన్ని రకాల వయసు కలవారు పాల్గొన్నారని అన్నారు. వెంకటరావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు పాల్గొనగా బి. కీర్తి 568 సూర్య నమస్కారాలు చేసి రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలవగా టి. స్వామి 295, టి. భార్గవి 269, పి. అస్మిత, ఆర్. మధుప్రియ, బి. శివాని, ఈ ఐశ్వర్య 268 సూర్య నమస్కారాలు పూర్తి చేసి బంగారు పతకాలు సాధించారన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

మంగళవారం | 13 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-మనోహరాబాద్



ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మనోహరాబాద్ ఎస్సై కరుణాకర్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని జీడిపల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి అక్రమంగా టిప్పర్ ద్వారా మట్టిని తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేయగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. దాంతో మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా మట్టిని తరలించడం చట్టరీత్యా నేరమని మట్టిని తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మనోహరాబాద్ ఎస్సై కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు.

పాఠశాలనా?..మద్యం సేవించే స్థలమా?

- బాలికల ప్రభుత్వోన్నత పాఠశాల అవరణలో మద్యం సీసాలు

నవతెలంగాణ-బెజ్జంకి



మద్యం ప్రియులు పాఠశాల అవరణంలో మద్యం సేవించడంతో పాఠశాలనా?..లేకా మద్యం సేవించే స్థలమా? అని పలువురు ఆశ్చర్యానికి గురవుతున్నారు. మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వోన్నత పాఠశాల అవరణంలో మద్యం ప్రియులు మద్యం సేవించిన మద్యం సీసాలను ధ్వంసం చేసి వెళ్లడంతో పలువురు అవాక్కు అవుతున్నారు. పాఠశాలలో పని చేసే సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మద్యం ప్రియులకు ప్రభుత్వోన్నత పాఠశాల నిలయంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఇలాంటి సంఘటన చోటుచే సుకోగా అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మళ్లీ ఇలాంటి సంఘటన సోమవారం పునారావృతమైందని అధికారులు ఉపేక్షించకుండా కఠిన చర్యలు చేపట్టి పాఠశాల కాపాడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

క్రీడా దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-చిన్నకోడూరు



చదువుకున్న వాళ్ళని చూసి స్ఫూర్తిని పొంది మా గ్రామ విద్యార్థులందరూ బాగా చదువుకోవాలనే ఆకాంక్షతో విద్యార్థులకు క్రీడ దుస్తులు అందజేస్తున్నట్లు దుస్తుల దాత ఏలేటి రాజారెడ్డి తెలిపారు. చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరికీ రూ.25 వేల రూపాయలు విలువగల క్రీడా దుస్తులను సోమవారం విద్యార్థులకు అందజేశారు. క్రీడా దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాజుల బాబు, మాజీ ఉపసర్పంచ్ పున్నం సురేష్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఏదుల్ల రాములు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రాజగోపాల్ పేట ఎస్సైగా భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ -నంగునూరు



నంగునూరు మండల రాజగోపాల్ పేట ఎస్సైగా యు.భాస్కర్ రెడ్డి సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. చేర్యాల పోలీస్ స్టేషన్ నుండి రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్ కు బదిలీపై వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన ఎస్సై మోహన్ రెడ్డి సీసీఆర్బీకి బదిలీపై వెళ్ళారు.నంగునూరు మండలానికి చెందిన తాజా, మాజీ ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.

హోంగార్డుకు వైద్య ఖర్చులకు సాయం

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ ఫైర్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న యాదగిరి ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి సురేష్ కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం తోటి అగ్నిమాపక సిబ్బంది ఉద్యోగులు కలిసి రూ.50 వేల రూపాయలను ఆర్థిక సాయం అందించారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని సురేష్ తెలిపారు.

సౌత్ ఇండియా బహుజన రైటర్స్ అవార్డులు అందుకున్న సిద్దిపేట వాసులు

నవతెలంగాణ-సిద్దిపేట



ప్రముఖ న్యాయవాది, సంఘ సేవకులు, విద్యా వేత్త వరుకోలు రాజలింగం జాతీయ సేవారత్న అవార్డును, సంఘ సేవకులు కొండూరి పవన్ కుమార్ బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డును తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ ఏడవ నేషనల్ కాన్ఫరెన్స్ లో ఆదివారం అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధా కృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబ్రహ్మణ్యన్ చేతుల మీదగా ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న వీరిని పలువురు అభినందించారు.

నర్సరీ పరిశీలించిన ఏపీవో

నవతెలంగాణ -హుస్నాబాద్ రూరల్



మండలంలోని కుచనపల్లి గ్రామంలోని నర్సరీ కేంద్రాన్ని సోమవారం ఏపీవో పద్మ పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పర్యవేక్షించారు. ఉపాధి హామీ కూలీలు ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం పూట రావాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి రాజమ్మ పాల్గొన్నారు.

మార్కండేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

నవతెలంగాణ-వెల్దుర్తి: మండల పరిధిలో మానేపల్లి గ్రామంలో సోమవారం అంగరంగ వైభవంగా మార్కండేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో హోమం ధూప దీప నైవేద్యం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాడిపంటలతో ఇంటిల్లిపాదులు సంతోషంగా ఉండాలని ఆ భగవంతున్ని మొక్కుకున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, అందుగులపల్లి శ్రీనివాస్, నిరంజన్ రెడ్డి, రాపర్తి శ్రీశైలం, సుదర్శన్, వెంకట్ రెడ్డి, శేఖర్, అశోక్‌లను శాలువాలతో సన్మానించి సత్కరించారు.

ప్రమాదవశాత్తు గుండంలో పడి వ్యక్తి మృతి

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వ రెడ్డి

నవతెలంగాణ- సిద్దిపేటరూరల్



ప్రమాదవశాత్తు కాలుజారి దేవస్థానం పరిధిలోని గుండంలో పడి ఓ యువకుడు చనిపోయిన సంఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సమీపంలో జరిగింది. ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణం హనుమాన్ నగర్ కు చెందిన దాసరి శివకుమార్ (19) మోటార్ వైండింగ్ వర్క్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో పుల్లూరు జాతర ప్రారంభమైన నేపథ్యంలో ఈనెల 10వ తేదీన జాతరకు వచ్చిన అతను ఆలయ సమీపంలోని కోనేరులో స్నానానికి దిగగా, ప్రమాదవశాత్తు గుండంలో ఇరుక్కుపోయి మరణించాడు. అతడు మరణించడం విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. అతని తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

16న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-దౌల్తాబాద్

ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ లక్ష్మి కోరారు. సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గ పరిస్థితిలు రోజురోజుకు దిగజారుతున్నాయనీ పోరాటాలు ఉధృతం అవుతున్నాయన్నారు. కార్మికులు, కర్షకులు, రైతులు, ప్రజలు ప్రధాని మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు జిల్లాల్లో, మండలాల్లో ప్రదర్శనలు, సభలు, సమవేశాలు, కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించామన్నారు. ఈ నెల16న దేశవ్యాప్తంగా పెద్దఎత్తున జరిగే ఆందోళన కార్యక్రమాలలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటి యు నాయకులు బాలమని, లక్ష్మి రవి,స్వామి పాల్గొన్నారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారుల నుంచి దాసారం గుట్టను కాపాడాలి

- అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్‌కు వినతి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం చుట్టూ ఉన్న దాసారం గుట్టను కబ్జా చేస్తున్న వారి నుంచి గుట్టను కాపాడాలని సీపీఐఎం జిల్లా కమిటీ సభ్యులు బద్దీపడిగా కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్‌కు సీపీఐఎం అద్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాల నుండి దాసారం గుట్ట కొమురవెల్లి మల్లన్నగుడి పరిధిలో ఉందని, దీని సర్వే నెంబర్ 305లో 22 ఎకరాల 10 గుంటల భూమి ఉందని తెలిపారు. దొరల కాలం నుండి ప్రభుత్వ భూమిని దేవాలయానికి వచ్చే విధంగా చూసేంత వరకు ఈ భూమిని బ్లాక్ లిస్టులో పెట్టాలని, దేవాలయం ద్వారా కానీ, ప్రభుత్వం ద్వారా ఈ భూమిని కొమరవెల్లి మల్లన్నకు తీసుకోవాలని, అప్పటివరకు ఈ భూమి క్రయవిక్రయాలు జరగకుండా ఆపాలని కోరారు. సీపీఐఎం కొమురవెల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో హైకోర్టులో ఈ భూమిని కొమురవెల్లి మల్లన్నకు కేటాయించాలని కేసు వేసినట్లు తెలిపారు. పలుమార్లు దేవాలయ ఈఓని కలిసి మెమోరాండం ఇచ్చామన్నారు. కొమురవెల్లి మల్లన్న వసతి గృహాలకు గుట్ట పైకి వెళ్లే రోడ్లకు దాదాపు 7 కోట్ల రూపాయలు రోడ్లకు ఖర్చు పెట్టినారన్నారు. ఆ డబ్బులు వృథా అయినవి తప్ప ఉపయోగంలోకి రాలేదనీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు వాళ్ల స్వప్రయోజనాలకు, కమిషన్లకు కక్కుతి పడి మల్లన్నకు భూములు తీసుకోవడంలో విఫలమయ్యారు. కొమురవెల్లి మల్లన్నకు దాసారం గుట్టని మల్లన్న ఆస్తిగా మార్చడం కోసం తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. భూమిని కాపాడడం కోసం మల్లన్న భక్తులను, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలను ఏకం చేసి పోరాటం చేయడానికి సీపీఐఎం సిద్దంగా ఉందన్నారు.



సీపీఐఎం నాయకులు దాసరి ప్రశాంత్, తడూరి రవీందర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలు చేసిన నిందితుడు అరెస్ట్



నవతెలంగాణ-రాయపోల్

సైబర్ నేరాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోయిన్ పల్లి, హైదరాబాద్ కు చెందిన ధనాల సూరజ్ డీజే ఆపరేటర్ గా పని చేసుకుంటూ ఫోటోగ్రాఫర్లకు బ్రాండెడ్ కెమెరాలును తక్కువ ధరలో ఇప్పిస్తారని ఫోన్ ద్వారా సంప్రదించి నమ్మకం కల్గించి కెమెరా ఫొటోస్ వాట్సప్‌లో పంపి నమ్మకం కలిగే విధంగా చెప్పి వారి నుంచి ఇతనికి తెలిసిన క్యాసినో అకౌంట్లోకి డబ్బులు మార్పిడి చేసుకునేవాడు. ఆ డబ్బులను గోవాలో క్యాసినో లాంటి ఆటలు ఆడి ఆ డబ్బులను స్థానికంగా గల రెండు నగదు వినియోగదారుల కేంద్రాలైనటువంటి ఇంటర్నెట్ సౌకర్యం కలిగిన కేంద్రాల నుంచి 2% కమిషన్ ఇచ్చి డబ్బులు తీసుకునేవాడు. ఈ విధంగా అనేక మందిని నమ్మించి మోసం చేసినాడు. బేగంపేటకు చెందిన సంగాని బాలరాజును ఫోన్ ద్వారా పరిచయం చేసుకొని, పై నిందితుడు వైజాగ్ నుంచి బిల్లు లేకుండా మంచి కెమెరాలు తక్కువ ధరకు తెప్పిచ్చి ఇస్తానని చెప్పి అతనికి తేదీ 16.11.2023 న అతనికి ఫోన్ చేసి 50 వేలకు సోనీ 7ఆర్-5 డిజిటల్ కెమెరా ఇస్తానని నమ్మించి అతని నుండి రూ.30 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.5 వేలు నాలుగు దఫాలుగా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు వేయించుకొని మోసం చేసినాడు. బాధితుడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించడం జరిగిందన్నారు. అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి గజ్వేల్ ఏసిపి రమేష్, సైబర్ క్రైమ్ ఏసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తొగుట సీఐ ఎస్.కె. లతీఫ్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శేఖర్, బేగంపేట ఎస్ఐ అరుణ్, సిబ్బంది కలిసి చాకచక్యంగా పై నిందితున్ని పట్టుకొని విచారణ జరపగా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో (30) ఫిర్యాదులు అందినవి. అదేవిధంగా ఇప్పటివరకు వివిధ పోలీస్ స్టేషన్లో (8) కేసులు నమోదయి ఉన్నాయి. వీటన్నిటిలో కలిపి మొత్తంగా రూ.4,46,000/- వేలు బాధితులు కోల్పోయినారు. గతంలోనూ ఇతనిని హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల ఒక కేసులో రిమాండ్ చేసి చంచల్ గూడ జైలుకు పంపించడం జరిగిందన్నారు. జైలు నుంచి విడుదలై వచ్చిన తర్వాత కూడా అతని యొక్క ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. నిందితుడు సూరజ్ వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్, రూ.10 వేలు రికవరీ చేసి తొగుట సిఐ లతీఫ్ పై నిందితున్ని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు పంపించడం జరిగిందన్నారు.సైబర్ నేరాలు అధిక సంఖ్యలో జరుగుతున్న కారణంగా మీకు గాని మీ పరిధిలో గాని ఏవైనా సైబర్ నేరాలు జరిగినట్లయితే వెంటనే 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదుచెయ్యాలని సూచించారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో తమ యొక్క ఫిర్యాదును నమోదు చేయగలరు. ప్రజలు తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, ఏవైనా మోసపూరిత ప్రకటనలు వచ్చినచో వాటిని నమ్మకూడదని సూచించారు.

సురభి ఉచిత వైద్య శిబిరం

- ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సురభి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేటలోని టిహెచ్ఆర్ నగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ కొండం కవితా సంపత్ రెడ్డి, సురభి మల్టీస్పెషల్టి హాస్పిటల్ పీఆర్వో పరుశురాములు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సుమారు 420 మందికి పైగా పరీక్షలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. నాలుగు రోజుల నుండి సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని భవిష్యత్తులో కూడా మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రజలు వాటిని



సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. అలాగే సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో అతి తక్కువ ధరలకే నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నమని తెలిపారు. పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులను అందజేసి సమస్య ఎక్కువగా ఉన్నవారిని హాస్పటల్కు వచ్చి పరీక్షలు నిర్వహించుకోవాల్సిందిగా రిఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ జనరల్ సర్జన్ ఆర్థోపెడిక్ స్త్రీల వైద్య నిపుణులు కంటి చిన్నపిల్లల వైద్య నిపుణులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి హుండీ ఆదాయం రూ.2 లక్షల 68 వేలు

నవతెలంగాణ -దుబ్బాక

అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని రామేశ్వరంపల్లిలో వెలసిన కూడవెల్లి రామలింగేశ్వరస్వామి మాఘమాస జాతర సందర్భంగా శరభేశ్వర దేవాలయం సిద్దిపేట ఈఓ కె.రవికుమార్ పర్యవేక్షణలో ఆలయ ఈవో విశ్వనాథ శర్మ, చైర్మన్ పూజారి చంద్రం సమక్షంలో సోమవారం హుండీ లెక్కింపును చేపట్టారు. జనవరి 8 నుండి ఫిబ్రవరి 12 వరకు హుండీ లెక్కింపు జరుపగా రూ.2,68,592 నగదు ఆదాయం, ఆన్లైన్ స్కానర్ ద్వారా (ఈ-హుండీ) రూ.2,217 ఆదాయం సమకూరిందన్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన కూడవెల్లి జాతరకు వేల



సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. జాతర నిర్వహణకు సహకరించిన ఆలయ కమిటీ సభ్యులకు, పూజారులకు, పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బంది, మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆల్ఫోర్స్ పాఠశాలకు పర్మిషన్ ఇచ్చిన ఎంఈఓను సస్పెండ్ చేయాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్‌లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ విద్యా ప్రమాణాలు పాటించని అల్ఫోర్స్ స్కూల్ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని, తప్పుడు అర్హత పత్రాలతో గుర్తింపు తీసుకొని నడుస్తున్న ఆల్ఫోర్స్ పాఠశాలకు పర్మిషన్ ఇచ్చిన ఎంఈఓను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా విద్యాశాఖ ఏడికి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని నిర్లక్ష్యంగా ఉన్న హుస్నాబాద్ ఎంఇఓను సస్పెండ్ చేయాలని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ హుస్నాబాద్‌లో నిబంధనలు పాటించకుండా నడుస్తున్న ఆల్ఫోర్స్ పబ్లిక్



స్కూల్ పై విద్యాధికారి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు . ఆల్ఫోర్స్ స్కూల్‌కు ఎలా పర్మిషన్ ఇచ్చారని ఆయన ప్రశ్నించారు.. జీవో నెంబర్ 1 ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను తీసుకోకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైన డి.ఈ ఓ స్పందించి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వేల్పుల ప్రసన్న కుమార్, సిద్దుల సుమన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర మరువలేనిది

- వైస్ ఎంపీపీ యంజా విఠల్‌రెడ్డి

నవతెలంగాణ-మనోహరాబాద్

గత ఐదు సవత్సరాలుగా గ్రామపంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లు చేసిన కృషిని అభివృద్ధిలో వారి పాత్రను మరువలేనిదని మనోహరాబాద్ మండల వైస్ ఎంపీపీ యంజాల విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మనోహరాబాద్ మండల సర్వసభ్య సమావేశాన్ని వైస్.ఎంపీపీ విఠల్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో యాదగిరిరెడ్డి నిర్వహించారు. అనంతరం మండలంలోని గ్రామాల సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో వారిని శాలువాలు మెమెంటోలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇచ్చిన ఆదేశాలతో ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లు తప్పకుండా పాటిస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. అలాగే గ్రామ కార్యదర్శుల సహకారం కూడా చాలా ముఖ్యమైందని వారు కూడా సర్పంచ్‌లకు సహకరించడంతో గ్రామాలు పూర్తి అభివృద్ధిలో ఉన్నాయన్నారు. అనంతరం కాళ్ళకల్ మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ తాము ఇతర



గ్రామాలు అలాగే ఇతర మండలాల్లోని గ్రామపంచాయతీల అభివృద్ధిని చూసి తాము ఎందులోనే తీసిపోకూడదనే లక్ష్యంతో పోటీ తత్వంతో అభివృద్ధిలో ముందున్నామని పేర్కొన్నారు. తమకు అధికారులు కూడా చాలా వరకు సహకరించారని వారి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. గ్రామాలలో తాము చేసిన అభివృద్ధి ఏ నాటికైనా గుర్తుండిపోతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కౌశిక్‌తో పాటు ఆయా శాఖల అధికారులు గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండల వ్యవసాయ అధికారి స్రవంతి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పంటల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని రైతులు తప్పని సరిగా పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

వాసవి క్లబ్బుల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-సిద్దిపేట: సిద్దిపేట వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్, యూత్ క్లబ్ మూడు క్లబ్బుల నూతన కార్యవర్గాన్ని జిల్లా గవర్నర్ భానూరి నర్సింలు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు, వాసవి కుటుంబ సురక్ష పథకం రూపకర్త వాసవియన్ గోల్డెన్ స్టార్ అయిత రాములు మాట్లాడుతూ వాసవి క్లబ్ లోని వ్యక్తి దురదృష్టవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ఆదుకోవాలని వచ్చిన ఆలోచనను కొందరి మిత్రులతో పం చుకొనగా అందరూ ముందుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షు లు గంప శ్రీనివాస్, వైస్ గవర్నర్ ఇరుకుల ప్రదీప్ కుమార్, గంప కృష్ణమూర్తి, పుల్లూరి శివకుమార్, నేతి వేణు కుమార్,



మాంకాల నవీన్ కుమార్, పుల్లూరి శ్రీనివాస్, పుల్లూరి శశాంక్, రీజియన్ 3 చైర్మన్ మంకాల శ్రీనివాస్, సెక్రటరీ మంచాల అభినయ్, కొంపల్లి విద్యాసాగర్, సోమ శివ కుమార్,సోమ వనజ, జోన్ చైర్మన్ చింత రాజేంద్రప్రసాద్, తోడుపునూరి కృష్ణవేణి, మూడు క్లబ్బుల పిఎస్టీలు, పూర్వ అధ్యక్షులు, తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ సభ్యులు కొమరవెల్లి అంజయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంప మహేందర్ రావు, మర్యాల వీరేశం పాల్గొన్నారు.

సెబి ఆధ్వర్యంలో ఆర్థిక క్రమశిక్షణ అవగాహన సదస్సు

- సిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలచంద్రం

నవతెలంగాణ-మెదక్ టౌన్: సెబి అనుబంధ సంస్థ ఎన్ఐఎస్యం, కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులకు ఆర్థిక క్రమశిక్షణ అను అంశంపై రెండు రోజుల అవగాహన సదస్సును నిర్వహించినట్టు ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్ డాక్టర్ బాలచంద్రం మాట్లాడుతూ మన నెలసరి ఆదాయాన్ని పెట్టుబడులలో పెట్టి ఆదాయాన్ని ఏ విధంగా వృద్ధి



చేసుకోవచ్చునో వివరించారు. వాణిజ్య శాస్త్ర శాఖాధిపతి డాక్టర్ శరత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో పెట్టుబడుల పట్ల ప్రోత్సహించడానికి ఇలాంటి సదస్సులు నిర్వహించి అవగాహన కలిగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, బి. చంద్రశేఖర్, శ్రీనివాస్, హరిత, నిదర్శిని, రఫిక్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి: సీపీ. డాక్టర్ అనురాధ

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

నూతనంగా ఎస్ఐలుగా బాధ్యతలు చేపట్టిన అధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని సీపీ. డాక్టర్ అనురాధ అన్నారు. సోమవారం సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలో రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా యు. భాస్కర్ రెడ్డి, కుకునూరుపల్లి పీఎస్ ఎస్ఐ గా పి. శ్రీనివాస్, సిద్దిపేట రూరల్ పీఎస్ నూతన ఎస్ఐ గా జి. అపూర్వ రెడ్డి, దౌల్తాబాద్ పీఎస్ ఎస్ఐ గా టి. శ్రీరామ్ ప్రేమ్ దీప్ లు బాధ్యతలు చేపట్టి, సీపీ అనురాధ ను కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె వారిని అభినందించి, శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని తెలిపారు. రాబోవు ఎంపీ ఎలక్షన్లో సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు.

కేంద్రంలో నరేంద్రమోదీ ఉంటేనే ధర్మాన్ని కాపాడతారు

నవతెలంగాణ -పాపన్నపేట

కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానిగా ఉంటే ధర్మాన్ని కాపాడుతాడాని బీజేపీ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపిస్తే కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానిగా చూడవచ్చని, ప్రతీ హిందూ బాంధవుడు బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో బూత్ కమిటీలు వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఒకరు ఇంకొకరికి, ఇంకొకరు మరొకరికి తెలిపి బీజేపీ



అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, పిఎం కిసాన్, విశ్వకర్మ గరీబ్ కళ్యాణ్ యోజనతో పేదలకు ఎంతో ఆసరాగా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు బీకొండ రాములు నేత, నాయకులు సుంకరి పెద్ద కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్ ఫ్యాబ్రిక్ పెయింటింగ్ పై ఉచిత శిక్షణ

నవతెలంగాణ-కొండపాక

నాబార్డ్ సహకారంతో కుకునూర్‌పల్లి మండలకేంద్రంలో ఐ.ఆర్.డి.ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ పై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతథులుగా గ్రామ మాజీ సర్పంచ్ జయంతి నరేందర్ , వెలుగు ఎపీఎం శ్రీనివాస్ , సీసీ లింగం, వివో లీడర్లు, గ్రామ మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 30 మంది మహిళలకు 20 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుంది. రోజూ శిక్షణతో పాటు మధ్యాహ్న భోజనం మరియు 1000 రూపాయిలు ఇవ్వడం జరుగుతుంది. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ తో పాటు బ్యాంకుల ద్వారా రుణ వసతి అందించి వారు సొంతంగా జీవనోపాధి పొందడానికి స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుంది అని తెలిపారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని





ఆర్థికంగా ఎదగాలని మహిళలకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ లింగం స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రాజలింగం పాల్గొన్నారు.

మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-దుబ్బాక: మార్కండేయ జయంతి సందర్భం గా సోమవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామని పద్మశాలి సమాజం అధ్యక్షుడు బడుగు రాజు తెలిపారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేయడం జరిగిందన్నారు. పద్మశాలి సమాజం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

